విశాఖ జిల్లాలోకి ఎస్.కోట?

ఎస్.కోట, కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, జామి మండలాలు విలీనం ప్రతిపాదన

- పార్లమెంటు నియోజకవర్గం మొత్తం ఒకే జిల్లాలో ఉండేలా చూడాలని యోచన
- 'పెందుర్తి'పైనా చర్చ -8లో



స్త్రీశక్తికి సన్నద్ధం

ఆర్టీసీ బస్సుల్లో రేపటి నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

- పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీఆర్డినరీ సర్వీసుల్లో అమలు
- కండక్టర్‌కు ఆధార్ కార్డు చూపితే.. 'జీరో ఫేర్' టికెట్ జారీ
- జిల్లాలో 89 శాతం బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం
- నెలకు సుమారు రూ.3 కోట్ల చొప్పున ఆర్టీసీకి చెల్లించనున్న ప్రభుత్వం



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

గత ఏడాది ఎన్నికల సమయంలో ప్రకటించిన 'సూపర్ సిక్స్'లో ఒకటైన 'ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం' హామీని నెరవేర్చడానికి కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. 'స్త్రీ శక్తి' పేరుతో ఈ నెల 15వ తేదీ నుంచి ఈ పథకాన్ని అమలు చేయనున్నది. ఇందుకు సంబంధించి జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటును ప్రభుత్వం కల్పిస్తున్నది. జిల్లాలోని రెండు డిపోల్లో వున్న 89 శాతం బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం వుంది. ఈ పథకం వల్ల సంస్థపై నెలకు సుమారు రూ.3 కోట్ల భారం పడుతుందని, ఈ సొమ్మును ప్రభుత్వం చెల్లిస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు వున్నప్పటికీ గత ఏడాది ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నది. ముఖ్యంగా సూపర్ సిక్స్‌లో ప్రధానమైన 'ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం' పథకాన్ని ఈ నెల 15వ తేదీ నుంచి అమలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ పథకానికి 'స్త్రీ శక్తి' అని పేరుపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న మహిళలు, యువతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ సర్వీసు వంటి ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహిళలు, యువతులు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఈ పథకం వర్తిస్తుంది. బస్సు ఎక్కిన తరువాత ఆధార్ కార్డును కండక్టర్‌కు చూపించాలి. కండక్టర్ 'జీరో ఫేర్ టికెట్'ను జారీ చేస్తారు. తరువాత ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ పథకాన్ని శుక్రవారం నుంచి అమలు చేసేందుకు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

జిల్లాలో 89 శాతం బస్సుల్లో ఉచిత ప్రయాణం

జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం ఆర్టీసీ డిపోల పరిధిలో మొత్తం 204 బస్సులు ఉన్నాయి. ఇందులో అనకాపల్లి డిపోలో 98, నర్సీపట్నం డిపోలో 106 వున్నాయి. వీటిల్లో 89 శాతం బస్సులు పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ సర్వీసులకు చెందినవి వున్నాయి. ఆర్టీసీ అధికారుల లెక్కల ప్రకారం రెండు డిపోలకు చెందిన బస్సుల్లో రోజూ సుమారు 48 వేల మంది ప్రయాణిస్తుంటారు. వీరిలో 20 వేల మంది వరకు మహిళలు, విద్యార్థినులు వుంటారని అంచనా. చార్జీల రూపంలో రోజూ రూ.22 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల రోజుకు రూ.10 లక్షల వరకు ఆదాయం తగ్గుతుంది. ఈ సొమ్మును ప్రభుత్వం ఆర్టీసీకి రీయింబర్స్ చేస్తుంది.

డ్రైవర్లు, కండక్టర్లకు శిక్షణ...

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని సమర్థంగా అమలు చేసేందుకు అధికారులు ఇప్పటికే తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు. డీపీటీవో ప్రవీణ ఆధ్వర్యంలో 262 మంది డ్రైవర్లు, 320 మంది కండక్టర్లకు శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఉచిత పథకం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు చేపడుతున్నారు. ప్రయాణికులపట్ల ఎలా నడుచుకోవాలి, ప్రభుత్వ మార్గదర్శకాలను ఎలా అమలు చేయాలన్నదానిపై డ్రైవర్లు, కండక్టర్లకు ఇప్పటికే శిక్షణ అందించారు.

ఉచిత ప్రయాణానికి ఏర్పాట్లు పూర్తి

- ప్రవీణ, డీపీటీవో



జిల్లాలో స్త్రీ శక్తి పథకాన్ని పక్కాగా అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఉచిత ప్రయాణం కావడంతో కొంతమేర రద్దీ పెరుగుతుందని భావిస్తున్నాం. మహిళలతోపాటు ఇతర ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ట్రాఫిక్ నియంత్రణ సిబ్బందిని నియమిస్తున్నాం. మహిళలు బస్సు ఎక్కిన తరువాత కండక్టర్‌కు ఆధార్ కార్డు చూపించి, ఎక్కడికి వెళ్లాలో చెబితే 'జీరో ఫేర్ టికెట్ జారీ చేస్తారు.

కుండపోత!

పలు మండలాల్లో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయం

- కాలువలను తలపించిన రహదారులు
- ఖరీఫ్ పంటలకు జీవం పోసిందని రైతులు ఆనందం



ఎలమంచిలిలో జలమయమైన కొత్తపేట రహదారి

(ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్)

మధ్య బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బుధవారం మధ్యాహ్నం తరువాత జిల్లాలో వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. సాయంత్రం తరువాత వర్షతీవ్రత పెరిగింది.

ముఖ్యంగా ఎలమంచిలి, పాయకరావుపేట, గొలుగొండ, కశింకోట, కోటవురట్ల, తదితర మండలాల్లో కుండపోతగా వర్షం పడింది. మిగిలిన మండలాల్లో చిరుజల్లులుపడ్డాయి. అంతకుముందు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్ర వేసవిని తలపించింది. దీనికితోడు ఉక్కపోత అధికంగా వుండడంతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. తరువాత వాతావరణం మారిపోయి ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. చినుకులతో మొదలైన వానకు ఈదురుగాలులు తోడై భారీగా కురిసింది. వరినాట్లు వేయడానికి ఈ వర్షం దోహదపడుతుందని రైతులు చెబుతున్నారు. రాగల మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు వున్నాయన్న వాతావరణ శాఖ సమాచారంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా అధికారులు మండల కేంద్రాల్లోనే వుండి అవసరం మేరకు సహాయక చర్యలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఎలమంచిలిలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగి, రహదారులపై ప్రవహించడంతో కాలువలను తలపించాయి. ధర్మవరం క్లబ్ రోడ్డు, కొత్తపేట మెయిన్ రోడ్డు, ఎంపీడీఓ కార్యాలయం రహదారి పూర్తిగా నీటమునిగాయి. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. అర్ధగంట వ్యవధిలో 37.6 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్టు అధికారులు తెలిపారు. కోటవురట్ల మండలంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి దాదాపు గంటపాటు కుండపోతగా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. వర్షం నీటితో ప్రధాన రహదారి చెరువును తలపించింది. వరి, పత్తి పంటలకు ఎంతో మేలు చేస్తుందని రైతులు అంటున్నారు. పాయకరావుపేటలో బుధవారం సాయంత్రం సుమారు గంటపాటు భారీ వర్షం పడింది. కొద్దిసేపు ఆగి మళ్లీ రాత్రికి కుండపోతగా వర్షం పడింది. మెయిన్ రోడ్డుతోపాటు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గొలుగొండ మండలంలోని పలుగ్రామాల్లో సుమారు రెండు గంటలపాటు భారీ వర్షం పడింది. గెడ్డల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. కశింకోట మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు కుండపోత వర్షం కురిసింది.



వర్షం నీటితో చెరువును తలపిస్తున్న కోటవురట్ల మెయిన్ రోడ్డు

డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు

ఉన్నత విద్యా శాఖ గ్రీన్ సిగ్నల్

- నర్సీపట్నం డిగ్రీ కళాశాలకు 300 సీట్లు కేటాయింపు



నర్సీపట్నంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల

నర్సీపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సాధారణ డిగ్రీ కోర్సుల్లో సింగిల్ మేజర్ సబ్జెక్టుకే ఉన్నత విద్యాశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇప్పటి వరకు డిగ్రీ కోర్సుల్లో సింగిల్ మేజర్ సబ్జెక్టా, డ్యూయల్ మేజర్ సబ్జెక్టా అనే డోలాయమాన పరిస్థితి ఉండేది. ఈ కారణంగా డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఇంతవరకు షెడ్యూల్ ఖరారు చేయలేదు. ఏప్రిల్‌లో ఇంటర్ పరీక్షాల ఫలితాలు వెలువడిన దగ్గర నుంచి డిగ్రీ చదవాలనుకుంటున్న విద్యార్థులు ఉన్నత విద్యాశాఖ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నారు. నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి ఏడాదిలో చేరడానికి 250 మంది ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకొని రెండు నెలలుగా వేచి చూస్తున్నారు. ఈ నేపథ్యంలో డిగ్రీ కళాశాలల్లో సింగిల్ మేజర్ సబ్జెక్టు సీట్లు కేటాయి చేస్తూ ఉన్నత విద్యా శాఖ ఈ నెల 10న ఉత్తర్వులు జారీ చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి నర్సీపట్నం డిగ్రీ కళాశాలకు 300 సింగిల్ మేజర్ సబ్జెక్టు సీట్లు కేటాయించారు. వాటిలో బీఏ హిస్టరీ 40 సీట్లు, బీఏ పొలిటికల్ సైన్స్ 40, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ 60, బీఎస్సీ బోటనీ 40, బీఎస్సీ కెమిస్ట్రీ 40, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ 40, బీఎస్సీ ఫిజిక్స్ 40 సీట్లు వున్నాయి. అయితే ప్రవేశాలకు ఇంకా షెడ్యూల్ విడుదల చేయ లేదు.

ఘనంగా తిరంగా యాత్ర



చోడవరంలో నిర్వహించిన తిరంగా యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజు, కూటమి నేతలు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కూటమికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతోపాటు విద్యార్థులు బుధవారం వాడవాడలా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ విజయానికి చిహ్నంగా భారత ప్రభుత్వం పిలుపు మేరకు జాతీయ జెండాలను చేతపట్టి ప్రధాన రహదారులు, వీధుల్లో ప్రదర్శనలు చేశారు. భారత్ మాతాకీ జై అంటు నినదించారు. పలుచోట్ల భారీ జాతీయ పతకంతో ర్యాలీ చేశారు. మానవహారాలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నుంచి శుక్రవారం వరకు ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని, ప్రతి ఒక్కరూ దేశభక్తితో ముందుకు సాగాలని నేతలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రిజిస్టర్ పోస్టు సేవలు కనుమరుగు

ఈ నెలాఖరు నుంచి నిలిపివేత

- వచ్చే నెల ఒకటి నుంచి స్పీడ్ పోస్టులో విలీనం
- మారుతున్న కాలానికి అనుగుణంగా తపాలా శాఖ నిర్ణయం

అచ్యుతాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసుల్లో బ్రిటీష్ హయాంలో నుంచి అమల్లో వున్న 'రిజిస్టర్ పోస్టు'కు ఆ శాఖ ముగింపు పలకనున్నది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఈ సేవలు నిలిచిపోనున్నాయి. రిజిస్టర్ పోస్టును స్పీడ్ పోస్ట్‌లో విలీనం చేయాలని భారత తపాలా శాఖ నిర్ణయించింది.

దేశంలోని పోస్టల్ వ్యవస్థలో రిజిస్టర్ పోస్టు సేవలు బ్రిటీష్ పాలనలోనే ప్రారంభమయాయి. 1854లో నాటి ఇండియన్ పోస్టాఫీస్ చట్టం మేరకు అప్పటి బ్రిటీష్ చక్రవర్తి లార్డ్ డల్‌హౌసీ రిజిస్టర్ పోస్టు సేవలు ప్రారంభించారు. కీలకమైన సర్టిఫికెట్లు, ఉద్యోగ నియామకపత్రాలు, లీగల్ నోటీసులు, ప్రభుత్వ ఉత్తర్వులను రిజిస్టర్ పోస్టు ద్వారా పంపేవారు. ఇవి ముఖ్యమైనవి కావడంతో సంబంధిత వ్యక్తులు/ అధికారులు/ కార్యాలయాలకు తప్పనిసరిగా చేరాలన్న ఉద్దేశంతో రిజిస్టర్ పోస్టు చేసేవారు. దీంతోపాటు ఒక ఎక్నాలెడ్జ్‌మెంట్ కార్డు వుంటుంది. రిజిస్టర్ పోస్టును అందుకున్న వ్యక్తి ఈ కార్డుపై సంతకం చేసి, తిరిగి పోస్ట్‌మన్‌కు ఇస్తే.. అది తిరిగి రిజిస్టర్ పోస్టు చేసిన వ్యక్తికి బట్వాడా చేస్తారు. తాను పంపిన వ్యక్తికి రిజిస్టర్ పోస్టు అందినట్టు దీని ద్వారా నిర్ధారించుకుంటారు. ప్రైవేటు కొరియర్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చే వరకు తపాలా శాఖ రిజిస్టర్ పోస్టుకు అధిక ఆదరణ వుండేది. అయితే పోస్టాఫీసు ద్వారా పంపే రిజిస్టర్ పోస్టులతో పోలిస్తే ప్రైవేటు కొరియర్ సంస్థల ద్వారా పంపితే త్వరగా గమ్యస్థానానికి చేరుతుండడంతో



... మిగతా 8వ పేజీలో

వైసీపీకి ఝలక్!



నూతన ఎంపీపీని సత్కరించిన సహచర సభ్యులు



ఎంపీపీగా ఎన్నికైన కేసుబోయిన వెంకటలక్ష్మి

- ఎస్.రాయవరం ఎంపీపీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ విజయం
- వైసీపీ అభ్యర్థికి 8 మంది, ప్రత్యర్థికి 11 మంది సభ్యుల మద్దతు
- పట్టునిలుపుకున్న వైస్ ఎంపీపీ గోవిందరావు

ఎస్.రాయవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ (ఎంపీపీ) అధ్యక్ష పదవికి బుధవారం ఇక్కడ నిర్వహించిన ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీచేసిన అభ్యర్థిని ఓడిపోయారు. ఆ పార్టీకి ఇటీవల రాజీనామా చేసిన బొలిశెట్టి గోవిందరావు.. స్వతంత్ర అభ్యర్థిని ఎంపీపీగా గెలిపించుకుని తన సత్తా చాటారు.

కొన్నినెలల నుంచి ఖాళీగా వున్న ఎంపీపీ పదవికి ఎన్నిక కోసం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మొత్తం 20 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను 16 మంది వైసీపీ, ముగ్గురు టీడీపీకి చెందిన వారు ఉన్నారు. ఎంపీపీ పదవి బీసీ మహిళకు రిజర్వు కావడంతో వైసీపీ తరఫున పెట్టుగోళ్లపల్లి ఎంపీటీసీ సభ్యురాలు వియ్యపు సత్యసూర్య విజయకుమారి, ఇండిపెండెంట్‌గా కొరుప్రోలు ఎంపీటీసీ సభ్యురాలు కేసుబోయిన వెంకటలక్ష్మి (ఈమె గత ఎన్నికల్లో వైసీపీ తరఫున గెలుపొందారు), టీడీపీ ... మిగతా 8వ పేజీలో

గంజాయి రవాణా కేసులో ముద్దాయికి పదేళ్ల జైలుశిక్ష

చోడవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో నిందితుడికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ స్థానిక 9వ అదనపు జిల్లా జడ్జి హరినారాయణ బుధవారం తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండున్నరేళ్లపాటు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళ్లితే.. చీడికాడ మండలం భైలపూడికి చెందిన గొల్లవిల్లి శ్రీనివాసరావు 2015 జూలై 9న ద్విచక్రవాహనంపై గంజాయి రవాణా చేస్తున్నాడు. ఇదే మండలం చెట్టుపల్లి వద్ద అప్పటి చీడికాడ ఎస్ఐ ఎ.కోటీశ్వరరావు వాహనాలు తనిఖీ చేస్తుండడంతో, పోలీసులను చూసి శ్రీనివాసరావు పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు వెంబడించి వాహనంతోసహా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు దాఖలు కొంతకాలం తరువాత కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ యు.వెంకటరావు వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో శ్రీనివాసరావును ముద్దాయిగా ప్రకటిస్తూ, పదేళ్ల జైలుశిక్షతో పాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ స్థానిక అదనపు జిల్లా జడ్జి బుధవారం తీర్పు వెలువరించారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

- ఏడుగురికి స్వల్ప గాయాలు
- స్టీరింగ్ లాక్ కావడంతో అదుపుతప్పిన బస్సు

కశింకోట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూతనగుంటపాలెం వద్ద ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. బుధవారం రాత్రి 8.30 గంటలకు జరిగిన ఈ సంఘటనలో ఏడుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా వున్నాయి. ఒడిశా రాష్ట్రం అడ్డుబంగి నుంచి ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బుధవారం హైదరాబాద్ వెళుతున్నది. కశింకోట మండలం నూతనగుంటపాలెం రిలయన్స్ బంకు వద్దకు వచ్చేసరికి వేగాన్ని అదుపు చేసే క్రమంలో సాంకేతిక సమస్య తలెత్తి స్టీరింగ్ లాక్ అయ్యింది. దీంతో బస్సు ఎడమ వైపు ఉన్న పంట కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. బస్సులో ప్రయాణిస్తున్న 35 మందిలో ... మిగతా 8వ పేజీలో



నూతనగుంటపాలెం వద్ద రోడ్డు పక్కకు బోల్తా పడిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

'జనవాణి' అర్జీల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయ్ కుమార్

ఎలమంచిలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరం పరిష్కరించేలా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే విజయ్ కుమార్ సూచించారు. బుధవారం పట్టణంలోని జడ్పీ అతిథి గృహంలో జనవాణి కార్యక్రమం నిర్వహించారు. నియోజవర్గ పరిధిలోనుంచి వచ్చిన సుమారు 106 అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించారు. వీటిని అర్జీలను ఆయా శాఖల అధికారులకు పంపించారు. నిబంధనలు ప్రకారం సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఎంపీడీఓ కేఎస్. కొండలరావు, నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పీఏసీఎస్ చైర్‌పర్సన్



ఎమ్మెల్యే విజయకుమార్‌ని సన్మానిస్తున్న శివశంకర్

అచ్యుతాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాంబిల్లి మండలం దిమిలి పీఏసీఎస్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన పొట్నూరి శివశంకర్ అచ్యుతాపురంలోని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ స్వగృహంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గోకివాడకు చెందిన శివ శంకర్ తన అనుయాయులతో వచ్చి ఎమ్మెల్యేను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సాయి, అల్లవరపు బాబ్జీ, సుందరపు నరసింగరావు, పొట్నూరి శ్రీను, ద్వారపురెడ్డి నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవం



అభయాంజనేయస్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

రాంబిల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్చూరు పంచాయతీ విజయరామపుర అగ్రహారం(సంతపాలెం)లో బుధవారం అభయాంజనేయస్వామివారి తీర్థ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించి పూజలు చేశారు. పంచాయతీ సర్పంచ్ కిల్లాడ మంగయ్యమ్మ, పంచాయతీ నాయకులు కిల్లాడ చినబాబుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. తప్పెడుగుళ్ళు, చిడతలు, ప్రత్యేక భజనలు తదితర సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ అలంకరణ ఆకట్టుకుంది.

సమస్యలపై ఆటో కార్మికుల నిరసన



తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు

ఎలమంచిలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ బుధవారం స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ఆటో కార్మికులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆటో యూనియన్ ప్రతినిధి గనిశెట్టి ఏసుదాసు మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు ప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలన్నారు. ఆటోలపై విధించిన అన్ని రకాల టాక్స్‌ల తగ్గించాలని, డీజీల్, గ్యాస్ సబ్సిడీపై మంజూరు చేయాలన్నారు. ఉబర్, వాలా సర్వీసులను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆటోలు కొనుగోలకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈమేరకు డీటీ వినయ్‌కుమార్‌కు వినతి పత్రమిచ్చారు. ఆటో యూనియన్ పట్టణ అధ్యక్షులు కొరారు తాతాజీ, అల్లిమల్ల నాగు, ప్రతినిధులు జి.విశ్వనాథం పాల్గొన్నారు.

వరుస వరినాట్లతో అధిక దిగుబడి: ఏఓ

అచ్యుతాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):వరుస క్రమంలో వరినాట్లు వేస్తే చీడపీడల నివారణతో పాటు అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో శంకర గోవింద్ అన్నారు. బుధవారం పెదపాడు, ఖాజీపాలెంలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలిచ్చారు. వరి నాట్లు కాలిబాటల ద్వారా తూర్పు, పడమరల దిశగా నాటాలన్నారు. దీని వల్ల చీడపీడలు తాకిడి తక్కువగా ఉండటంతో పాటు ఎరువులు, పిచికారీకి అనుకూలంగా ఉంటుందన్నారు. సూర్యరశ్మి ఎక్కువగా తగిలి దుబ్బు బాగా చేస్తుందన్నారు. వరిదుబ్బులు చివర్లు తుంచి నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది కేబీ సూర్యనారాయణ, పీలా కోదండ, సన్యాసినాయుడు, బాబూరావు, బద్ది తాతలు, సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటనను విజయవంతం చేయాలి

▸▸ పార్టీ జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు



సమావేశంలోమాట్లాడుతున్న పార్టీ జిల్లా ఇన్‌చార్జి చిట్టిబాబు

పాయకరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఈ నెల 17న వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు పిలుపునిచ్చారు. బుధవారం పాయకరావుపేట వచ్చిన ఆయన పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి స్థానిక నాయకులు చేపడుతున్న కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మాధవ్ బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా జిల్లాకు వస్తున్నందున బహిరంగ సభకు నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ శ్రీరంగం రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రత్నభరత్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీకాంత్, పార్టీ మండల అధ్యక్షుడు పి.నానాజీ, నాయకులు ఎం.గాంధీ, జోగినాయుడు, ఎస్.గణేశ్, కువల కుమార్, వి.వెంకటరమణ, రాజు, మూలాస్వామి, జగదీశ్, పి.రాంబాబు, సూరిబాబు, నాయుడు, ప్రవీణ్, దాడి శ్రీను పాల్గొన్నారు.

సమన్వయంతో నియోజకవర్గ అభివృద్ధి: ఎమ్మెల్యే సుందరపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అచ్యుతాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి శ్రేణులంతా సమన్వయంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ అన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కూటమి శ్రేణుల సమన్వయ కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఎలమంచిలి నియోజకవర్గం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉన్నందున ప్రజలతో పాటు కర్మాగారాలకు మౌలిక వసతులు త్వరిత గతిన కల్పించాల్సి ఉందన్నారు. ముఖ్యంగా రహదారులు, హైవేతో కనెక్టివిటీకి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. రవాణా సౌకర్యాలు మెరుగు పడితే ఆర్థికాభివృద్ధి త్వరితగతిన సాధించవచ్చన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి కల్పనకు ప్రాధానం ఇస్తున్నట్టు చెప్పారు. రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వర రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందిన రైతులకు సంఘీభావంగా గురువారం సాయంత్రం ఎలమంచిలి రైల్వే బ్రిడ్జినుంచి భారీ ట్రాక్టర్ ర్యాలీని నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. రైతులంతా హాజరవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసి నాయుడు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, నియోజక వర్గ పరిశీలకులు బొండి జగన్నాథం, నాయకులు కర్రి సాయికృష్ణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాస రావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం, జనపరెడ్డి శ్రీనివాస రావు, పీలా తులసీ రామ్, ఆడారి మంజు తదితరులు పాల్గొన్నారు

నేడు, రేపు నాటిక ప్రదర్శనలు

మునగపాక, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నందీశ్వర ప్రాంగణంలోపి తులసీ కళావేదికపై ఈ నెల 14, 15 తేదీలలో నాటిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్టు యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఈనెల 14న చీమా చీమా ఎందుకు కుట్టావ్, మాతృదేవోభవ, 15న ఉదయం జెండా ఆవిష్కరణ, అనంతరం యువతీ, యువకులకు ఆటలపోటీలు, రాత్రికి గీత దాటితే నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. ఇద్దరు రంగస్థల నటులకు సత్కారం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మళ్ల రామజోగి, ఆడారి లక్ష్మణరావు, కె.వి.ఎస్. బుద్ధ నాగు తదితరులు పాల్గొన్నారు.

జ్వర పీడితులకు వైద్య పరీక్షలు



రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి వెంకటేష్

రాంబిల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమిలి పీహెచ్‌సీ వైద్యులు ఆర్ . వెంకటేష్ ఆధ్వర్యంలో మర్రిపాలెం గ్రామంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరపీడితులను గుర్తించి వారికి రక్తపరీక్షలు నిర్వహించారు. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర జ్వరాలు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. జ్వరపీడితులు అశ్రద్ధ చేయకుండా సకాలంలో పీహెచ్‌సీకి వచ్చి మెరుగైన వైద్యసేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి ఎస్ఎస్‌వీఎస్ రాజు, సిబ్బంది సీహెచ్ ధనరాజు, చాందిని, ఏఎన్ఎం నిర్మలాకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దాత ఆర్థిక సాయంతో తరగతి గదుల నిర్మాణం



తులసీనగర్ బాలికోన్నత పాఠశాలలో తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎలమంచిలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యా ప్రగతికి కూటమి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని బాలికోన్నత పాఠశాల ఆవరణలో పట్టణానికి చెందిన కర్రి ధనరెడ్డి దంపతులు ఆర్థిక సహాయంతో నిర్మించిన నూతన తరగతి గదులు భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ కృషికితోడు కర్రి ధనరెడ్డి వంటి దాతలు విద్యాభివృద్ధికి చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. అలాగే, మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి భాగస్వాములు కావాలని కోరుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో అరుణ్‌కుమార్, హెచ్ఎం సుశీల, కూటమి నేతలు, ఆదిమూర్తి, అధికారులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌కు మెగా ఫోన్ వితరణ

మునగపాక, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి మెగాఫోన్ సెట్ వితరణ చేశాడు. మునగపాకకు చెందిన పెంటకోట గిరిబాబు తన అన్న శ్రీను జ్ఞాపకార్థం బుధవారం హెచ్.ఎం శ్రీనివాసరావుకు దీనిని అందజేశారు. గతంలో తాగునీటిని శుద్ధి చేసే పరికరాన్ని ఇచ్చారు.

మత్స్యకారుల అప్రమత్తతతో దేశ భద్రత



మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ సీఐ సింహాద్రినాయుడు

అచ్యుతాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో మత్స్యకారులే దేశ రక్షకులని పూడిమడక మెరైన్ పోలీస్ స్టేషన్ సీఐ సింహాద్రి నాయుడు అన్నారు. పూడిమడక శివారు కొండపాలెం సామాజిక భవనంలో జరిగిన మత్స్యకారుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మత్స్యకారులు చేపల వేట సమయంలో సముద్రంలోకి వెళ్లినప్పుడు కొత్త వ్యక్తులు గాని, కొత్త బోట్లుకాని కనబడితే వెంటనే తమకు తెలియాలన్నారు. జీపీఎస్ వినియోగంపై వివరించారు. ఎస్ఐ బీహెచ్‌వీఎస్ఎన్ రాజు, ఎస్. రామ్ కుమార్, బి. అప్పలరాజు, రావతి కుమార్, వీఎస్ అతుల్, టి. దేముడు బాబు తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు: ఎస్ఐ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ సుధాకర్

అచ్యుతాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వ్యసనంతో జీవితాలు చిత్తవుతాయని స్థానిక ఎస్ఐ సుధాకర్ హెచ్చరించారు. బుధవారం స్థానిక అచ్యుత జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఈ సమయంలో తప్పటడుగులువేస్తే జీవితాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి వెళ్లాలని సూచించారు. కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగించినా, ప్రేరేపించినా 100 నంబరుకు తెలియజేయాలని సూచించారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరావు, అచ్యుత విద్యాసంస్థ కరస్పాండెంట్ పల్లి శేషగిరి రావు, ప్రిన్సిపాల్ ఆర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా రెపరెపలాడాలి



రాంబిల్లిలో తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాంబిల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):మువన్నెల జెండాను ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై ఎగురవేయాలని బీజేపీ అనకాపల్లి పార్లమెంట్ కన్వీనర్ వర్మరాజు, మండల శాఖ అధ్యక్షుడు కారేరాముడు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో తిరంగర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు వంటి నేతల బలిదానంతో ప్రస్తుతం దేశంలోని ప్రతి ఒక్కరూ స్వేచ్ఛావాయువులు పీల్చుకోగలుతున్నామన్నారు. మహోన్నత చరిత్ర కలిగిన జాతీయ జండాను ఇళ్ల, కార్యాలయాలపై ఎగువేసి దేశభక్తిని చాటుకోవాలన్నారు. పలువురు నేతలు రవిరాజు, వర్మరాజు, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: ప్రతి ఒక్కరిలో దేశభక్తిని చాటడమే లక్ష్యంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజాన సన్యాసినాయుడు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఆగస్టు 15 వరకు ప్రతి ఒక్కరు ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మళ్ల కాశేశ్వర రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో కూటమి నాయకులు టెక్కలి పరశరాం, పెంటకోట విజయ్, రాజేశ్వరరావు, వాసు, నేషనల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



మునగపాకలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో కూటమి శ్రేణులు

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



ఎలమంచిలి మిల్ట్రీ కాలనీలో నిలిచిన వర్షం నీరు

ఎలమంచిలి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని పలు ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. దీంతో జనాలు రాకపోకలకు ఇబ్బంది ఎదుర్కొన్నారు. పట్టణంలో ఇటీవల లక్షలాది రూపాయల వ్యయంతో ప్రధాన డ్రైనేజీలో పూడికతీత పనులు చేపట్టినా రహదారుల దుస్థితి మారకపోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. వర్షం పడిన ప్రతిసారీ రోడ్లు జలమయమవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తంచేశారు. పట్టణంలో బుధవారం సాయంత్రం అర గంట కురిసిన వర్షం 37.6 ఎం.ఎం. నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షానికి ధర్మవరం క్లబ్ రోడ్డు, కొత్తపేట ప్రధాన రోడ్డు, ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణం జలమయమయ్యాయి. పంటలకు మేలు చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

పాయకరావుపేటలో...

పాయకరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో బుధవారం కుండపోత వర్షం పడింది. ఉదయం నుంచి భానుడు ప్రతాపం చూపగా మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి గంట పాటు భారీ వర్షం కురిసింది. తరువాత నుంచి చినుకులు పడుతూనే, రాత్రి మరోమారు కుండపోతగా వాన పడింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మెయిన్ రోడ్డులోని చిత్రమందిర్, లక్ష్మి థియేటర్ సెంటర్లు చెరువులను తలపించాయి.



పాయకరావుపేటలో దంచికొడుతున్న వర్షం



కోటవురట్ల ఎంపీడీవో కార్యాలయం రోడ్డుపై నిలిచిపోయిన వర్షం నీరు

కోటవురట్లలో...

కోటవురట్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వారం రోజుల నుంచి పలు విడతలుగా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో కుండపోత వాన పడింది. ఉదయం ఎండ అదరగొట్టగా, మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా ఎంపీడీవో కార్యాలయం రోడ్డుపై నీరు నిలిచిపోయి చెరువును తలపిచింది. గెడ్డలు, వాగులు ప్రవహించాయి. కాగా, ఈ వర్షం ఖరీఫ్ పంటలకు ఎంతగానో దోహదపడుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

కాలనీ గృహాల నిర్మాణాలను పూర్తి చేయండి

▸▸ ప్రభుత్వ అదనపు సాయాన్ని వినియోగించుకోండి

▸▸ నక్కపల్లి సొసైటీ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి



కాలనీ లబ్ధిదారులతో మాట్లాడుతున్న సొసైటీ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి

నక్కపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం కేటాయించిన లే అవుట్లలో ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా వున్న లబ్ధిదారులంతా డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి చేసుకోవాలని నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం అదనంగా సాయమందిస్తుందని, ప్రభుత్వ ప్రోత్సాహం వినియోగించుకుని ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేసుకోవాలని సూచించారు. ఉపమాక సచివాలయం వద్ద పలువురు కాలనీ గృహాల లబ్ధిదారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కేటాయించిన రూ1.8 లక్షలకు అదనంగా కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవడానికి బీసీ, ఎస్సీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు అదనంగా రూ.75 వేలు సాయం అందిస్తున్నట్టు చెప్పారు. నక్కపల్లి మండలంలో 661 మంది లబ్ధిదారులను ప్రాథమికంగా గుర్తించామని, ఇకపై అధికారులు తరచూ లే అవుట్లు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడతారని చెప్పారు. ఈ సమావేశంలో హౌసింగ్ ఏఈ పి.జగన్, సెక్రటరీ జయప్రకాశ్, వీఆర్వో కామరాజు, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు, తోలేటి శ్రీను, యలమంచిలి రమణబాబు, వెంకటేశ్, గొల్లపల్లి వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ వడ్డీకి గృహ రుణాలు మంజూరు చేస్తాం

▸▸ నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ బుజ్జి



విలేకర్లతో మాట్లాడుతున్న సొసైటీ పాలక మండలి ప్రతినిధులు

నక్కపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి పీఏసీఎస్ పరిధిలో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్నవారందరికీ తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తామని సొసైటీ చైర్ పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో డైరెక్టర్లు కోసూరి శ్రీను, మనబాల కొండబాబుతో కలిసి స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. నివాస గృహాలపై రూ.5 లక్షల వరకూ తక్కువ వడ్డీకి రుణాలిస్తామని చెప్పారు. రుణాలు కావాల్సిన వారు ఇంటి పత్రాలను తీసుకుని పీఏసీఎస్ కార్యాలయాన్ని సంప్రదించాలని చెప్పారు. కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లి వీలైనంత మందికి గృహనిర్మాణాలు మంజూరు చేసేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. వారి వెంట సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఎస్.రాయవరం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోకులపాడు వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. చెన్నై నుంచి కోల్‌కతా వెళుతున్న ప్రైవేట్ అంబులెన్స్ గోకులపాడు వద్ద పక్కన ఆగి ఉన్న కూరగాయల ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటో జాతీయ రహదారి పక్కనే ఉన్న కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నక్కపల్లి మండలం, రమనయ్యపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కసిరెడ్డి నాగ సత్తిబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని స్థానికులు నక్కపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పనులపై ఎంపీడీవో ఆరా

నక్కపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవవరం, ఒడ్డిమెట్ట, డొంకాడ గ్రామాల్లో అభివృద్ధి పనులపై ఎంపీడీవో డి.సీతారామ రాజు ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో డిప్యూటీ ఎంపీడీవో చలపతి రావుతో కలిసి బుధవారం ఆయన పర్యటించారు. డొంకాడలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సర్పంచ్ చందిన కొండలరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. దేవవరం, ఒడ్డిమెట్ట గ్రామాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. తడి, పొడి చెత్త ఏరివేతను పరిశీలించారు. ఒడ్డిమెట్టలో మంచినీటి కొళాయిలకు కొత్త ట్యాప్‌లను ఏర్పాటు చేయించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

పాయకరావుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.లలిత సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. చెడు వ్యసనాలకు బానిసలైన వారి ఆరోగ్యం పాడవడంతో పాటు సమాజం చిన్నచూపు చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజ, అధ్యాపకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

▸▸ అనకాపల్లి, సబ్బవరం మండలాల్లో జాతీయ జెండాలను చేతబట్టి ముందుకు సాగిన విద్యార్థులు ▸▸ స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాన్ని వివరించిన బీజేపీ నేతలు


అనకాపల్లి గాంధీనగరంలో...



సీతానగరంలో జాతీయ జెండాలను చేతబట్టి ర్యాలీ నిర్వహిస్తున్న జడ్పీ హైస్కూల్ విద్యార్థులు (ఇన్‌సెట్) బీజేపీ నాయకులు



సబ్బవరంలో...

కొత్తూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. బీజేపీ అనకాపల్లి మం డల అధ్యక్షుడు కప్పిరి తాతారావు ఆధ్వర్యంలో సీతానగరంలోగల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాలను చేతబట్టి గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ముందుకు సాగారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

తుమ్మపాల : ప్రతి ఒక్కరూ దేశభక్తితో ముందుకు సాగాలని బీజేపీ జిల్లా కార్యదర్శి భానుమతి పేర్కొన్నారు. అనకాపల్లి గాంధీనగరంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా యాత్రలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఈ నెల 15వ తేదీ వరకు ప్రతి ఇంటి వద్ద జాతీయ జెండాను ఎగురవేసి తమ దేశభక్తిని చాటుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు నివాళులర్పించి వారి పోరాటాలను స్మరించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి గాంధీనగరంలోని పురవీధుల్లో జాతీయజెండాలతో ర్యాలీని నిర్వహించారు. బీజేపీ నాయకులు నర్సింగ్‌యాదవ్, వుడా రమేష్, రాజు, శ్రీరామ్, కనకమహాలక్ష్మి, సంతోష్, రామకృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఇక్కడి మూడు రోడ్ల జంక్షన్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లి రామునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు గొంప నర సింగరావు ఆధ్వర్యంలో రేజంర్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. తోటివారిపట్ల సోదరభావంతో మెలుగుతూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రెడ్డి రాము నాయుడు, పెచ్చెట్టి అప్పారావు, కె.శ్రీనివాసవర్మ, సామ్రాట్ కుమార్, సోమునాయుడు, పోతల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాల అందజేత


సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలు అందజేస్తున్న పీలా గోవింద్

అనకాపల్లి రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారేడుపూడి, రేబాక, గొలగాం, గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ బుధవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో 14 మందికి తొమ్మిది లక్షల రూపాయల సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాలాపు కనకరాజు, టీడీపీ నాయకులు ఈగల వెంకునాయుడు, బొండా నూకరాజు, జనసేన నాయకులు మాడిశ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల ఆలయ భూముల కౌలు వేలం ఖరారు

కశింకోట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కశింకోట వేణుగోపాల స్వామి దేవస్థానం భూముల కౌలుకు బుధవారం ఎట్టకేలకు వేలం నిర్వహించారు. వెదురుపర్తిలో గల 7.54 ఎకరాల భూములకు సంబంధించి ఆలయం ఆవరణలో వేలంపాట చేపట్టగా దేవదాయ శాఖకు రూ.1,76,200ల ఆదాయం సమకూరింది. గతంలో నిర్వహించిన వేలంలో ఆయా భూములకు కేవలం రూ.77వేలు మాత్రమే రాగా, ఈ ఏడాది అదనంగా రూ.99,200 ఆదాయం రావడం విశేషం. గత నెల ఈ భూములకు వేలం నిర్వహించగా స్థానిక రైతుల నుంచి అభ్యంతరాలు రావడంతో వాయిదా పడిన విషయం తెలిసిందే. మళ్లీ పోలీసులు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో ఆయా భూములకు వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణమూర్తి, వేణుగోపాలస్వామి ఆలయ వ్యవస్థాపక చైర్మన్ రేజేటి రామాచార్యులు, అర్చకుడు రేజేటి మారుతి తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో


రికార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి

సబ్బవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి బుధవారం తనిఖీ చేశారు. తొలుత మందులు భద్రపర్చే గదిని పరిశీలించారు. ఓపీ, సిబ్బంది హాజరు వివరాలను తెలుసుకున్నారు. ఔట్ పేషెంట్ల సంఖ్య ఎక్కువగా ఉన్నట్టు ఆమె గుర్తించారు. వారికి తగిన విధంగా డ్రగ్స్ స్టోర్‌లో పని చేసేందుకు మరో సహాయకుడ్ని నియమిస్తామని చెప్పారు. ఆసుపత్రి భవనం దుస్థితిని ఆమె దృష్టికి వైద్య సిబ్బంది తీసుకు వెళ్లారు. సుమారు నలభై సంవత్సరాల క్రితం నిర్మాణం చేపట్టడంతో శిథిలావస్థకు చేరుకుందన్నారు. దీనిపై ఆమె మాట్లాడుతూ భవనం స్థితిగతులపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆశ, డాక్టర్ విద్యాధరి, ఫార్మసిస్టు ఈశ్వరరావు, సీహెచ్‌వీ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

'ఆర్థిక ఇబ్బందులు ఉన్నా విజయవంతంగా పథకాలు'


దేశపాత్రునిపాలెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

పరవాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. దేశపాత్రునిపాలెంలో బుధవారం ఆయన పర్యటించి ఏడాది పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ పథకాలు అమలులో సీఎం చంద్రబాబు వెనక్కి తగ్గడం లేదన్నారు. టీడీపీ నాయకులు కుమార్, సత్యారావు, శ్రీనివాస్, రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలో కన్నూరులో టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న పర్యటించి పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ బొండా తాతారావు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు పోతల నూకరత్నం, గొల్లవిల్లి సంధ్య, నేతల సోమేష్, శీర సన్యాసిరావు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు


ఎస్ఐ మహాలక్ష్మికి ఫిర్యాదు కాపీని అందిస్తున్న ఐద్వా ప్రతినిధులు

పరవాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి టిడ్కో గృహ సముదాయం వద్ద ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక మహిళలతో కలిసి ఎస్ఐ మహాలక్ష్మికి ఆమె ఫిర్యాదు కాపీ అందజేశారు. రాత్రి వేళల్లో పలువురు మద్యం సేవించి ఇళ్ల తలుపులు కొట్టడంతో పాటు దొంగతనాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. గంజాయి వంటి మత్తుపదార్థాలను సేవించి మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. గృహాల్లో కొంతమంది బ్యాచిలర్స్ అద్దెకు ఉంటూ నానా హంగామా చేస్తున్నారని, వెంటనే ఇటువంటి వారి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల ప్రతినిధులు తుంపాల అన్నపూర్ణ, ఎం.బంగారమ్మ, అరుణ, వరలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో వద్ద ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ధర్నా


డిపో ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయూఏ కార్మికులు బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ పీఆర్‌సీని, ఐఆర్‌ను తక్షణమే ప్రకటించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ డిపో తరలింపు ఆపాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రతినిధులు పి.సుధాకర్, కేఎస్‌వీ రమేష్, పీవీఆర్ మూర్తి, బీఆర్ఏ రావు, కేఎస్ భూషణం, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

మూడు మండలాల్లో భారీ వర్షం


కశింకోట జాతీయ రహదారిపై కుండపోతగా వర్షం కురుస్తున్న దృశ్యం


పరవాడలో రాత్రి తొమ్మిది గంటల సమయంలో...

అనకాపల్లి టౌన్/ కశింకోట/ పరవాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా బుధవారం అనకాపల్లి, కశింకోట, పరవాడ మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి విభిన్నమైన వాతావరణం నెలకొంది. కాసేపటికి ఎండ కాయడం, ఆ వెంటనే ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకోవడం జరిగేది. పలుచోట్ల మోస్తరు వర్షం పడినప్పటికీ సాయంత్రం నాలుగు నుంచి సుమారు గంటపాటు కుండపోతగా కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు గ్రామీణ ప్రాంత రహదారులు చిత్తడిగా మారాయి. గత కొద్దిరోజులుగా వేడితో అల్లాడిపోయిన జనం వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ఉపశమనం పొందారు. ఇదిలావుంటే, పరవాడ పరిసర ప్రాంతాల్లో రాత్రి భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా ఏకధాటిగా పడడంతో ప్రధాన రహదారుల పైనుంచి వరద నీరు పారింది. వాడచీపురుపల్లి, ఎన్టీపీసీ, ఫార్మాసిటీ తదితర ప్రాంతాల్లోనూ ఇదే వాతావరణం నెలకొంది. వర్షం దాటికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వరి ఆకుమడులు, కూరగాయల పంటలకు ఈ వర్షం ఊపిరి పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి పండుగ


సత్తెమ్మతల్లికి ఎమ్మెల్యే కొణతాల పూజలు


అమ్మవారిని దర్శించుకుంటున్న నాగజగదీశ్వరరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దాసరిగెడ్డ రోడ్డులో కొలువుదీరిన సత్తెమ్మతల్లి పండుగ బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజామున అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టి, పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరి పారు. సాయంత్రం ఘటాల ఊరేగింపు నిర్వహించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేడు కోట్నివీధి, గవరపాలెం ప్రాంతాల్లో మరిడిమాంబ పండుగ



ఇదిలావుంటే, కోట్ని వీధి, గవరపాలెం ప్రాంతాల్లో గురువారం మరిడిమాంబ పండుగ జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దారి పొడుగునా విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. రాత్రికి కోట్నివీధి రామాలయం, గాంధీబొమ్మ జంక్షన్‌లలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

వ్యవసాయ రంగంలో 'కార్పొరేట్' వద్దు

▸▸ నెహ్రూచౌక్‌లో రైతు సంఘాల ఆందోళన



నిరసన తెలియజేస్తున్న రైతు సంఘాల నాయకులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగంలో కార్పొరేట్ కంపెనీలకు అనుమతులు వద్దంటూ రైతు సంఘాల నాయకులు బుధవారం నెహ్రూచౌక్‌లో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్‌మోర్చ జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవసాయ చట్టాలను మార్చుతుందని ఆరోపించారు. దీని వలన రైతాంగానికి తీవ్రంగా నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎస్ఈజెడ్ పేరుతో లక్షల ఎకరాల భూములను రైతుల నుంచి బలవంతంగా ప్రభుత్వం తీసుకుని కార్పొరేట్ కంపెనీలకు ఎకరా రూపాయి చొప్పున దీర్ఘకాలికంగా లీజులకు ఇస్తోందని ఆరోపించారు. ఇలా అయితే రైతుల పరిస్థితి ఏం కావాలని ప్రశ్నించారు. తొలుత కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం కన్వీనర్ కోన మోహన్, జిల్లా వృత్తిదారుల సంఘం కన్వీనర్ గంటా శ్రీరామ్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, గండి నాయనబాబు తదితరులు పాల్గొన్నారు.

82వ వార్డు సమస్యలపై జీవీఎంసీ కమిషనర్‌కు వినతి


కమిషనర్‌కు వినతిని అందిస్తున్న కార్పొరేటర్ సునీత

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 82వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు కార్పొరేటర్ మందపాటి సునీత బుధవారం వినతి పత్రం అందజేశారు. వివిధ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి పనులు చేపట్టాలని విన్నవించారు. శాంతి పార్కు, విజయరామరాజుపేట ఓపెన్ జిమ్, గాంధీనగరం మహాత్మా పార్కును అభివృద్ధిపరచాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు జానకి రామరాజు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతిజ్ఞ


సాయినగర్ కాలనీలో మాట్లాడుతున్న పరవాడ సీఐ మల్లికార్జునరావు


సబ్బవరం గురుకులంలో మాట్లాడుతున్న సీఐ రామచంద్రరావు

పరవాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని దేశపాత్రునిపాలెం పరిధి సాయినగర్‌కాలనీలో బుధవారం రాత్రి నిర్వహించిన విజుబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో మాట్లాడారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు తమ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వాహనాలు వేగంగా నడిపి ప్రమాదకరంగా వ్యవహరించే యువకులు, అనుమానాస్పద వ్యక్తులు కంటపడితే తెలియజేయాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సీఐ జి. రామచంద్రరావు సూచించారు. ఇక్కడి గురుకుల విద్యాలయం, ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటైన అవగాహన సదస్సుల్లో మాట్లాడారు. మాదకద్రవ్యాల వల్ల ఎదుయ్యే దుష్పరిణామాలను వివరించారు. సైబర్ మోసాలు, ఫేక్ లింక్స్, ఓటీపీ స్కామ్‌ల బారిన పడకుండా ఉండేలా పలు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ, హెచ్ఎం తిరుపతిరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని పలు కళాశాలల్లో మాదకద్రవ్యాల నిర్మూలనపై బుధవారం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అలాగే, సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కళాశాల, హిమశేఖర్ జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సాధికారిత అధికారిణి ఎన్.సూర్యలక్ష్మి ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా కార్యక్రమాన్ని జరిపారు. పిల్లలు డ్రగ్స్‌కు బానిసలు కావద్దన్నారు. ఈ కార్యక్రమాల్లో మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి. రాములమ్మ, జిల్లా మిషన్ కో-ఆర్డినేటర్ మేరీ సువార్త, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎం.రమేష్, బాలల రక్షణ అధికారి కేవీఎల్ మనోహర్ పాల్గొన్నారు.

భారీ గణనాథుని విగ్రహ ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కోట్ని బాలాజీ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో చేపడుతున్న సుమారు 110 అడుగుల భారీ వినాయక విగ్రహ ఏర్పా ట్లను డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ బుధవారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా కమిటీ కన్వీనర్ బుద్ద భూలోక నాయుడు ఏర్పాట్లను ఆయనకు వివరించారు. అత్యంత భారీ గణపతి విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేస్తుండడాన్ని ఆయన అభినందిస్తూ ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు.

నూకాంబిక అమ్మవారి ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆలయ ఈవో కేఎల్ సుధారాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవదాయ ధర్మాదాయ చట్టం 30/1987లోని సెక్షన్ 15 అండ్ 17లోని సబ్ - సెక్షన్ (1) కింద ఈవో ప్రకటన జారీ చేశారు. ధర్మకర్తల మండలికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారులు 30 ఏళ్ల పైబడి ఉండాలని, హిందూ మతస్థులై ఉండాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు దేవస్థానం వారిని సంప్రతించాలని కోరారు.

సీపీఐ జోనల్ కమిటీ ఎన్నిక


ఎన్నికైన వెంకటరావు, భద్రం

తుమ్మపాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ అనకాపల్లి జోనల్ కమిటీ ఎన్నికను బుధవారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. జోనల్ కార్యదర్శిగా తాకాశి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా వైఎస్ భద్రం ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కోరిబిల్లి శంకరరావు, శ్రీరామదాసు అబ్బులు, కరణం మాణిక్యాలరావు, కొమ్మనాపల్లి వెంకటరమణ, పి.నూకప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు జోనల్ పరిధిలో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

'20 నుంచి సీపీఐ రాష్ట్ర మహాసభలు'



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

తుమ్మపాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈనెల 20 నుంచి జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఇక్కడ ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ముక్తకంఠంతో ఎండగట్టాలన్నారు. నాయకులు రాజాన దొరబాబు, గురుబాబు, ఫణీంద్రకుమార్, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



అరకులోయలో మహిళా కళాశాల విద్యార్థినులు తిరంగా ర్యాలీ



జాతీయ పతాకాలతో డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు

అరకులోయ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ప్రతి ఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్‌కుమార్‌నాయక్, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాశాలల ఎన్ఎస్ఎస్ పీవోలు, అధ్యాపకులు బుధవారం విద్యార్థులతో వేర్వేరుగా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మీ, అనితకుమారి, పి.నాగబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండబాబు పాల్గొన్నారు.

హుకుంపేట: మండల కేంద్రంలో బీజేపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు, మఠం సర్పంచ్ శాంతి కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. కామయ్యపేట జంక్షన్ వద్ద గాంధీ నాలుగు నాలుగు రోడ్డు వద్ద ఉన్న గాంధీజీ, మర్రి కామయ్య, అల్లూరి విగ్రహాలకు పూలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోట్నాపల్లి ఎంపీటీసీ సభ్యుడు బాలకృష్ణ జ్ఞానసాగర్ కాలేజీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



హుకుంపేటలో ర్యాలీ..

వాడీవేడిగా పెదబయలు మండల సమావేశం

» జీసీసీ, ఆర్‌అండ్‌బీ, విద్య, వ్యవసాయ అధికారుల పనితీరుపై సభ్యులు ఆగ్రహం



ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లను సముదాయిస్తున్న ఎంపీడీవో

పెదబయలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశం వాడీవేడీగా సాగింది. ఎంపీపీ బొండా వరహాలమ్మ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైంది. అయితే, సభ్యులుసరిగా హాజరుకాకపోవడంతో 11:15 గంటల తరువాత సమస్యలపై చర్చ నిర్వహించారు. తొలుత స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బొంజుబాబు మాట్లాడుతూ, ప్రతినిధులతో సమన్వయం చేసుకోకుండా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం పలువురు సభ్యులు పలువురు అధికారులతీరుపై నిలదీశారు. గిరిజన సహకార సంస్థలో జరిగిన అవకతవకా లపై వైస్ ఎంపీపీ రాజుబాబు, ఎంపీటీసీ బొంజుబాబు మేనేజర్‌ను నిలదీశారు. సమాచార హక్కు చట్టంప్రకారం మండల పరిధిలోని జీసీసీకి సంబంధించి వివరాలు కోరి మూడునెలలవుతున్నా సమాచారం ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మూడు గ్యాస్ సిలెండర్ల నగదు లబ్ధిదారుల ఖాతాలకు జమ కాకపోవడంపై మేనేజర్‌ను ప్రశ్నించారు. అనంతరం పాడేరు- జోలాపుట్టు ప్రధాన రహదారిలో బంగారుమెట్ట నుంచి సంపంగిపుట్టు వరకు ఆరు కిలోమీటర్ల మేర మరమ్మతులు చేపట్టాలని ఐదేళ్లగా డిమాండ్ చేస్తున్నా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. రెవెన్యూ శాఖ ద్వారా ఎల్‌పీసీలు లేకుండా ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని తహశీల్దార్ త్రినాధరావునాయుడును కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల దాటుతున్నా ఉపాధ్యాయులు లేక బొంగరం, ఇంజరీ, గిన్నెలకోట పంచాయితీల్లో పలు గ్రామాల పాఠశాలలు తెరచుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈస్థితిలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని బహిష్కరిస్తామని ఆయా పంచాయితీల ప్రతినిధులు హెచ్చరించారు. పెదబయలు పీహెచ్‌సీకి మంజూరైన ల్యాబ్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్‌ను సభ్యులు కోరారు. ఉపాధి హామీ పథకంలో సిల్వర్ ఓక్ మొక్కలు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారంగా రైతులకు పంపిణీ జరగలేదంటూ ఏపీవోను నిలదీశారు. మండల వ్యాప్తంగా 30 గోకులాలు మంజూరు చేస్తే కేవలం మూడు మాత్రమే పూర్తయ్యాయన్నారు. అలాగే, మండలంలో సుమారు 2000 మంది రైతులకు అన్నదాతసుఖీభవ నగదు జమ కాలేదన్నారు. 16 సచివాలయాల పరిధిలో పశువులకు వివిధ వ్యాధులు ప్రబలకుండా టీకాలు వేసినట్టు, 23 పంచాయతీల పరిధిలో ఎక్కడ మూగ జీవాలకు ఇబ్బంది కలిగినా 1962కు సమాచారం అందించాలని పశు వైద్యాధికారి విజయ్‌పాణిగ్రహి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణయ్య, వైస్ఎంపీపీ- 1 పాంగి సోనే, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్‌కు అభినందనలు



గంగులయ్యను సత్కరిస్తున్న జనసేన జిల్లా కార్యదర్శి సీతారామ్, చింతపల్లి నాయకులు

చింతపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పార్టీని నమ్ముకుని, కష్టపడి పనితచేసే నాయకులు, కార్యకర్తలకు అధిష్ఠానం సుముచిత స్థానం కల్పిస్తుందని జనసేన జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారామ్ అన్నారు. జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్‌గా నియమితులైన జనసేన పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి వంపూరి గంగులయ్యను చింతపల్లి జనసేన నాయకులు కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో పార్టీని బలోపేతానికి కృషి చేస్తున్న గంగులయ్యను జానపద కళలు, సృజనాత్మక అకాడమి చైర్మన్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉగ్రంగి లక్ష్మణరావు, దూనబోయిన రమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిముడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



ములియగుడ వద్ద ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

అనంతగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములియగుడలో బుధవారం ఆటో డ్రైవర్ల ఆందోళన వ్యక్తం చేపట్టారు.ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి కిలో మోస్య మాట్లాడుతూ.. నిరుద్యోగులు కుటుంబాల పోషణకు ఆటోలపై ఆధార పడుతున్నారు. అయితే, ఈనెల 15నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణంతో వారి జీవనానికి ఇబ్బంది ఎదురవుతుందన్నారు. ఈ స్థితిలో ఆటో డ్రైవర్ల కు నెలకు రూ.25 వేల చొప్పున భృతి ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

శాస్త్రీయ పద్ధతిలో సాగుతో అధిక దిగుబడి: శాస్త్రవేత్త జోగారావు

చింతపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వరి సాగు చేపట్టాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ జోగారావు అన్నారు. బుధవారం ఎర్రబొమ్మలు గ్రామంలో వ్యవసాయ అధికారులు రైతు సదస్సు ఏర్పాటు చేశారు. శాస్త్రవేత్త మాట్లాడుతూ రైతులు సకాలంలో వరి నాట్లు వేసుకోవాలన్నారు. నారు పిలకలను తుంచుకుని, వరుసల పద్ధతిలో నాటుకోవాలన్నారు. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు పూర్తిగా విడిచిపెట్టాలన్నారు. సేంద్రియ సాగు చేసుకోవాలన్నారు. ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలు ఉపయోగించాలన్నారు. ఆధునిక, శాస్త్రీయ పద్ధతులను రైతులు పాటించడం వల్ల నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మధుసూదనరావు, పశువైద్యాధికారి చల్లంగి చాలిని పాల్గొన్నారు.



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త జోగారావు

రైతులకు రాయితీపై పనిముట్లు: ఏవో

ముంచంగిపుట్టు: అర్హులైన గిరిజన రైతులు అందరికీ రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను అందించనున్నట్టు మండల వ్యవసాయ అధికారి (ఏవో) మురళీకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని ఏనుగురాయి, కొండపడ గ్రామాల్లో రైతు సదస్సు, పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో పవర్ టిల్లర్లు, టార్పాలిన్లు అవసరమని రైతులు తెలిపారు. రాగుల పంట సాగులో యాజమాన్య పద్ధతులు, ఘన జీవామృతం ద్రవ జీవామృతం, వేప కషాయం తయారీ విధానంపై రైతులకు వివరించారు. పీఎంఎఫ్‌బీవై ఇన్సూరెన్స్ తదితర వివరాలు తెలియజేశారు. అన్నదాత సుఖీభవ సొమ్ము జమకాని వారు వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిరగం నరసింగరావు, ఏకలవ్య సీఈవో రత్నాకుమారి, ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీ దామోదరం, యూనిట్ ఇన్‌చార్జి చిట్టిబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతు సదస్సులో మాట్లాడుతున్న ఏవో మురళీకృష్ణ

హుకుంపేట వైస్ ఎంపీపీగా సుశీల ఎన్నిక



సుశీలకు ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్న డీఎల్‌పీవో, ఎంపీడీవో

హుకుంపేట ఆగస్టు 13 ఆంధ్రజ్యోతి: మండల వైస్ ఎంపీపీగా జి. సుశీల ఎన్నికయ్యారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. వైసీపీకి చెందిన సంతరి ఎంపీటీసీ సభ్యులు సుశీల, బీజేపీకి చెందిన కొట్నాపల్లి సభ్యుడు బాలకృష్ణ ఇద్దరు పోటీలో నిల్చున్నారు. ఈ ఎన్నికలో సుశీలకు 9 మంది, బాలకృష్ణకు ఐదుగురు సభ్యులు మద్దతుగా ఓట్లు వేశారు. దీంతో నాలుగు ఓట్ల ఆధిక్యతతో సుశీల గెలుపొందినట్టు మండల ప్రత్యేక ఆధికారి చంద్రశేఖర్, ఎంపీడీవో రమాదేవి ప్రకటించారు. గూడా ఎంపీటీసీ సభ్యులు ప్రియాంక వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. ఆమె తన ఓటు హక్కు వేయడానికి రాలేదు. అనంతరం వైస్ఎంపీపీ గెలుపొందినట్టు ధ్రువపత్రాన్ని సుశీలకు అధికారులు అందించారు. అనంతరం ఆమెను ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎంపీపీ రాజుబాబు, వైసీపీ నేతలు సత్కరించారు.

హుకుంపేటలో తాగునీటి సమస్యపై ర్యాలీ

హుకుంపేట ఆగస్టు 13 ఆంధ్రజ్యోతి: మండల కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు హైమావతి, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణారావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గ్రామంలోనుంచి మండల పరిషత్ వరకు ర్యాలీ నిర్వహించారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని, వీధిలైట్లు, డ్రైనేజీలు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ ఆధికారి చంద్రశేఖర్‌రావు, ఎంపీడీవో రమాదేవిలకు వినతి ప్రత్రాలు అందించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నేతలు మాట్లాడుతూ మండల కేంద్రంలోని సీపీఎం అడుమండ రోడ్డు, రామాలయం వీధి, సాయి బాబా ఆలయ పరిసరాల్లో పదేళ్లగా నీటి సమస్యతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయం ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా ఫలితంలేకపోయిందని వాపోయారు. ప్రభుత్వం ఇంటింటికీ కుళాయి పథకం పేరిట నిధులు మంజూరు చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కాంట్రాక్టర్లు, సంబంధిత ఆధికారులు నిధులు గోల్‌మాల్ చేస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపుగా పీహెచ్‌ఎన్‌కు అవార్డు



కలెక్టర్ , పీవోలనుంచి అవార్డును అందుకుంటున్న పీహెచ్‌ఎన్ వెంకటలక్ష్మి

అనంతగిరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లుంగుపర్తి పీహెచ్‌సీలోని పీహెచ్‌ఎన్‌గా విధులు నిర్వహిస్తున్న పసుపులేటి. వెంకటలక్ష్మి బుధవారం కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అభిషేక్‌గౌడల నుంచి పాడేరులో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు.. పోషణ అభియాన్ లక్ష్యాలకు అనుగుణంగా పీహెచ్‌సీ పరిధిలోని మారుమూల గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలకు ఆమె సేవలను అందించారు. ఈ నేపథ్యంలో అవార్డు అందుకున్నలక్ష్మిని వైద్యాధికారిణి మంజు భార్గవి, తోటి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

'పంచకర్ల' దృష్టికి ఆర్వీనగర్ -పాలగెడ్డ రోడ్డు సమస్య



ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే రమేష్‌బాబుతో జనసేన నాయకులు

సీలేరు, ఆగస్టు 13 , (ఆంధ్రజ్యోతి) : సీలేరు జనసేన పార్టీ నాయకులు బుధవారం చింతపల్లి విచ్చేసిన ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, , పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీకేవీధి మండలంలో ఆర్వీనగర్ పాలగెడ్డ అంతర్రాష్ట్ర రహదారి ప్రధాన సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. ఎన్నో ఏళ్లగా ఉన్న రహదారి సమస్యను జనసేన నాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ వంపూరి గంగులయ్య, సీలేరుకు చెందిన బాలకృష్ణ, బొజ్జ, సత్తిబాబు పాల్గొన్నారు.

గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలి: ఎస్ఐ




మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్ర

సీలేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సాగు, రవాణా వం టి కార్యకలాపాలకు గిరిజన యువత దూరంగా ఉండాలని స్థానిక ఎస్ఐ రవీంద్ర సూచించారు. ధారకొండ పంచాయతీ నరమామిడి గొంది గ్రామంలో ఎస్ఐ ఆధ్వర్యంలో గిరిజనులకు చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంజాయి జోలికి వెళ్ళవద్దని హెచ్చరించారు. గం జాయి రవాణాతో గిరిజన యువత భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే తమ బ్యాంక్ అకౌంట్లు ఖాళీ అయిపోతాయన్నారు. సైబర్ నేరగాళ్లు పంపించే లింక్‌లను ఓపెన్ చేసి నా, మీ బ్యాంక్ ఖాతా నెంబర్లను చెప్పినా మోసగిస్తారని అన్నారు. ద్వి చక్ర వాహనదారులు హెల్మెట్‌లను ధరించాలని, అధిక వేగంతో ప్రయాణించవద్దని సూచించారు. అనంతరం గ్రామంలోని విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పుస్తకాలు, యూనిఫారాలు పంపిణీ చేశారు. యువతకు వాలీబాల్ కిట్‌ను ఆయన అందజేశారు.

గ్రామాల్లో తాగునీటికి దివీస్ సాయం

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో రెండు గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణానికి దివీస్ కంపెనీ యాజమాన్యం రూ. 4 లక్షలు వితరణగా అందజేసింది. పనులు చేపడుతున్న శారద ట్రస్టుకు చిప్పాడలోని దివీస్ కార్యాలయంలో కంపెనీ ప్రతినిధులు బుధవారం చెక్కు అందించారు. ఈనిధులతో బెడ్డుగూడ, కిన్నంగూడ గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు నిర్మించనున్నట్టు ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్ర మంలో దివీస్ కంపెనీ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, సామాజిక సేవా విభాగం మేనేజర్ డి. సురేశ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పుడమి తల్లి సిగలో పచ్చని హారం



పెదబయలు, ముంచంగిపుట్టు సరిహద్దులో గిరులు

ముంచంగిపుట్టు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు మన్యం కొత్త అందాలతో రూపుదిద్దికుంటోంది. పెదబయలు, ముంచంగిపుట్టు సరిహద్దున బూసెల గ్రామ సమీపంలో ఇదిగో ముక్‌మల్ క్లాత్ కప్పుకున్న రీతిలో గిరులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పైన నీలాకాశం.. కనుచూపు మేరలో గిరులు, వాటిపై తివాచీలా పెనవేసుకున్న పచ్చదనం చూపరులను మైమరపిస్తోంది. మధ్యలో లోయ.. మెలికలు తిరుగుతూ రోడ్డు ఎక్కడో విదేశాల్లో ఉన్న అనుభూతి కలుగుతోంది. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' కెమెరాలో బంధించింది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గెడ్డల ప్రవాహాలు, చెట్లు అందాలతో కనువిందు చేస్తున్నాయి.

లోతుగెడ్డ-రాళ్లగెడ్డ రోడ్డు దుస్థితిపై వినతి

చింతపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అత్యంత అధ్వానంగా తయారైన లోతుగెడ్డ-రాళ్లగెడ్డ రహదారి దుస్థితిని కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లినట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి తెలిపారు. బుధవారం చింతపల్లి వచ్చిన కలెక్టర్‌ని కలిసిన ఎంపీపీ కలిసివినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాళ్లగెడ్డ-లోతుగెడ్డ రోడ్డు శిథిలావస్థకు చేరడంతో ఆది వాసీలు అవస్థలు పడుతున్నారన్నారు.కలెక్టర్‌పీఎంజీఎవై పథకంలో రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారన్నారు బలపం సర్పంచ్ రమేశ్‌నాయుడు పాల్గొన్నారు.



కలెక్టర్‌కి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీపీ అనుషదేవి

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి: సీఐ



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

హుకుంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు వాహన చోదకులు పాటించాలని స్థానిక సీఐ సన్యాసి నాయుడు సూచించారు బుధవారం స్థానిక కామయ్యపేట జంక్షన్ వద్ద ఎస్ఐ సూర్యనారాయణ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడతూ వాహన రికార్డులు, డ్రైవ ర్లు లైసెన్సు తప్పసరిగా ఉంచాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే లైసెన్సులు రద్దు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి: రోడ్డు భద్రత నియమాలను పాటించాలని స్థానిక ఎస్ఐ డి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని ములియగుడ వద్ద ఆటో, జీపు డ్రైవర్లకు బుధవారం అవగాహన కల్పించారు. వాహనదారులు తప్పసరిగా సీటుబెల్ట్, హెల్మెట్ ధరించి వా హనాలు నడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రాణాలు మీదకు తెచ్చుకోవద్దని, మితిమీరిన వేగంతో ప్రయాణిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గంజాయి రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిధులు వ్యయంపై ఫిర్యాదు



పెదకోడపల్లి గ్రామ కార్యదర్శికి వినతిపత్రమిస్తున్న దండకారణ్య సమితి ప్రతినిధులు

పెదబయలు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదకోడపల్లి పంచాయతీ అభివృద్ధికి ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులు, వివరాలు తెలియజేయాలని బుధవారం దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీదరి భీమేశ్వరరావు, సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శి యోగిరాజుకు సమాచార హక్కు చట్టం ప్రకారం పిర్యాదు చేశారు. 2017- 2018 వార్షిక సంవత్సరం నుంచి 2025 జూన్ వరకు పంచాయితీలో ఉపాధి పథకం, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా మంజూరైన మరుగుదొడ్ల వివరాలు, వాటి నిధుల చెల్లింపుల సమాచారమివ్వాలని కోరారు. 2019 నుంచి 2025 జూన్ వరకు నిధులు,వాటి ఖర్చులు, ఇళ్లపన్ను వివరాలందించాలన్నారు. 2019 సెప్టెంబర్ నుంచి సచివాలయ సిబ్బంది క్షేత్ర పర్యటన వివరాలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తయ్య, నాగేశ్వరరావు, సింహాచలం, రత్నకుమార్, సింహచలం తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారులపై ఆర్‌అండ్‌బీ ఎస్ఈకి లేఖ

చింతపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో అధ్వా న రహదారులతో ప్రయాణికులు ఎదుర్కొంటున్న అవస్థలను వివరిస్తూ ఆర్‌అండ్‌బీ ఎస్ఈకి లేఖ పంపిచామని మాజీ ఎమ్మెల్యే పసుపులేటి బాలరాజు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాడేరు- చోడవరం, చింతపల్లి-సీలేరు, భద్రాచలం, పాడేరు- ముంచంగిపుట్టు, పెదబయలు రహదారులు పూర్తిగా పాడైపోయాయన్నారు. పాడేరు- చోడవరం, సీలేరు- చింతపల్లి రహదారుల్లో నిత్యం రద్దీగా ఉంటాయన్నారు. నాలుగు రాష్ట్రాల ప్రజలు యి రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఈ రహదారుల్లో గోతులు వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బదులను ఎదుర్కొంటున్నారన్నారు. అర్‌అండ్‌బీ అధికారులు వెంటనే స్పందించి రహదారులు నిర్మించాలని కోరుతూ ఎస్ఈకి లేఖ పంపిచామన్నారు.

లింగాపురంలో ఉరకలెత్తుతున్న జలపాతం

» కొండలపై కనువిందు

కొయ్యూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిట్టింపాడు పంచాయతీ లింగాపురం సమీపంలో కొండలపై నుంచి జలపాతం వరదనీటితో ఉరకలేస్తోంది. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎతైన పెద్ద రాయిపై నుంచి జాలువారుతున్న ప్రవాహం ఆకట్టుకుంటోంది. ఈ జలపాతం వద్దకు నర్సీపట్నం నుంచి చింతపల్లి వెళ్లే మార్గంలో డౌనూరు చేరుకుని అక్కడి నుంచి సుమారు 7 కిలోమీటర్ల దూరంలోని గోపవరం ఆటో లేదా ద్విచక్ర వాహనాలపై వెళ్లాలి. అక్కడినుంచి సుమారు మూడు కిలోమీటర్లు మేర బాహుబలి కొండ అంచుకు కాలినడకన వెళ్తే.. ఈ సుందర జలపాతం చేరుకోవచ్చు. ఈ పరిసరాలు ప్రకృతి రమణీయతతో ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. కొండలను అనుకుని పాల నురుగు లాంటి మేఘాలు, పరిసరాల్లో పక్షుల కిలకిలరావాలు, అరుదైన పూలతో ఆకర్షణీయంగా ఉంటోంది. జలపాతం వద్దకు గోపవరం నుంచి కనీస రహదారి సౌకర్యం లేకపోవటంతో ఈ ప్రాంతానికి గుర్తింపు లేకుండా ఉంది. ఇక్కడి బండరాయి నుంచి దుమికే నీరు.. కిందకొలను.. పర్యాటకంగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందటమే కాకుండా లింగాపురం వాసులకు జీవనోపాధికి వీలవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.



లింగాపురం సమీపంలో జలపాతం



నీలి మేఘాల మధ్య ప్రకృతి రమణీయతతో కొండలు



రావికమతం మండలం టి.అర్జాపురంలో తిరంగా ర్యాలీ దృశ్యం

ఉత్సాహంగా తిరంగా యాత్ర

చోడవరం/రావికమతం/బుచ్చెయ్యపేట/రోలుగుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు బుధవారం తిరంగా యాత్రను ఊరూరా ఉత్సాహంగా నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ విజయానికి చిహ్నంగా భారత ప్రభుత్వం పిలుపు మేరకు చోడవరం, నర్సీపట్నం, మాడుగుల నియోజకవర్గాలోని అన్ని మండలాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. చోడవరం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరిన కూటమి నాయకులు, ప్రధాన రహదారిపై జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, గేదెల సత్యనారాయణ, కనిశెట్టి మత్స్యరాజు, సిరిపురపు రమేశ్, గూనూరు మూలినాయుడు, గోకివాడ కోటేశ్వరరావు, బొడ్డేడ రామునాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే రావికమతం మండలంలోని టి.అర్జాపురం గ్రామంలో తిరంగా ర్యాలీ చేశారు. జాతీయ జెండా చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుటాల చిన్న, కార్యదర్శి దంట్ల సత్యనారాయణ, సీఆర్పీ జి.రామారావు, గ్రామస్థులు పాల్గొన్నారు. రోలుగుంట మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పచ్చిగొళ్ల ఈశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమ్మ, కళాశాల ప్రిన్సిపాల్ సహదేవుడు, సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ అరవింద్‌కుమార్ పాల్గొన్నారు. బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాది గ్రామంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ర్యాలీని ప్రారంభించగా, వడ్డాది హైస్కూల్ నుంచి జంక్షన్ వరకు సాగింది. కూటమి నాయకులు గేదల సత్యనారాయణ, తమరాన దాసు, దొండా నరేశ్, దొండా గిరిబాబు, ఎస్.శ్రీరామూర్తి, దేవర అప్పారావు, సింగంపల్లి రమేశ్, జి.కోటేశ్వరరావు, దూది రాజేశ్, సీతానాగరాజు, దొండా నానాజీ పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గంలో...



చీడికాడలో తిరంగా ర్యాలీ చేస్తున్న నాయకులు, ప్రజలు, విద్యార్థులు

మాడుగుల/చీడికాడ/కె.కోటపాడు/దేవరాపల్లి: మాడుగుల నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మాడుగుల బస్టాండ్ ఆవరణలో జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు, నాయకులు జెండాలు పట్టుకొని మానవహారంగా ఏర్పాడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మండల సంతోషి, సుబ్బలక్ష్మి, రొబ్బా మహేశ్, ఎస్.శ్రీనివాసరావు, ఎం.సతీశ్, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. చీడికాడలో భారీ స్థాయిలో తిరంగ ర్యాలీ నిర్వహించారు. చీడికాడ శివాలయం నుంచి గ్రామం వరకూ ర్యాలీగా వెళ్లి, రాజీవ్ కళామందిరం ముందర మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పాతాళం బాలకృష్ణ, నాయకులు రెడ్డి కొండబాబు, సలాది వెంకటేశ్వర్లు, పి.కొండబాబు, సిహెచ్.శివాజీరాజు, గాడి సత్యనారాయణ పాల్గొన్నారు. కె.కోటపాడులో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తిరంగా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాతీయ జెండాను గౌరవించాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే దేవరాపల్లి మండల కేంద్రంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు.

నర్సీపట్నం నియోజకవర్గంలో...



మాకవరపాలెం రహదారిపై నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీ

నర్సీపట్నం/మాకవరపాలెం/గొలుగొండ/నాతవరం: నర్సీపట్నం నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో తిరంగా ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. నర్సీపట్నలోటని నారాయణ ఇంగ్లీషు మీడియం స్కూల్లో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాకాలతో విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. అలాగే దేశ భక్తులు, స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణలో ఆలరించారు. ఫ్యాన్సీ డ్రెస్ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే మాకవరపాలెంలో తిరంగా యాత్ర నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు జెండాలు చేతబట్టి తామరం జంక్షన్ నుంచి మాకవరపాలెం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ప్రతీ ఇంటిపై తిరంగా జెండా ఎగురవేయాలని సూర్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మత్రినాయుడు పాల్గొన్నారు. అలాగే గొలుగొండ, కృష్ణాదేవిపేట, నాతవరం మండల కేంద్రాల్లో తిరంగా ర్యాలీని కూటమి నాయకులు, విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు.

కొవ్వూరులో కేంద్ర బృందం పర్యటన

రోలుగుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొవ్వూరు గ్రామంలో బుధవారం కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, హెల్త్ సబ్ సెంటర్, జడ్పీ పాఠశాలను సందర్శించారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలను పరిశీలించారు. కార్యక్రమంలో బృందం సభ్యుడు సునీల్, ఎంపీడీవో నాగేశ్వరరావు, సర్పంచ్ వై.కాంతమ్మ, స్థానిక నేత యర్రంశెట్టి రాజారావు పాల్గొన్నారు.

చీమలపాడులో...



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రవివర్మ తదితరులు

రావికమతం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపాడు గిరిజన పంచాయతీలో స్వచ్ఛభారత్ ప్రతినిధి కె.రవివర్మ బుధవారం పర్యటించారు. గ్రామంలో మరుగుదొడ్ల సదుపాయాలు, కంపోస్టు ఎరువుల తయారీ, తడి, పొడి చెత్త నిర్వహణ విధానాలను, తాగునీటి వనరులను పరిశీలించారు. సంపద తయారీ కేంద్రం పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామస్వామి, కార్యదర్శి రాజ్‌కుమార్, సర్పంచ్ వంజరి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

జి.కోడూరులో సమస్యల తిష్ఠ

ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్తాచెదారం

పడకేసిన రక్షిత నీటి పథకం

తాగునీటికి అల్లాడుతున్న జనం

మాకవరపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.కోడూరు గ్రామంలో సమస్యలు తిష్ఠ వేశాయి. నెల రోజులుగా ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయాయి. పంచాయతీ కార్యాలయం ఆవరణతో పాటు ప్రభుత్వ పాఠశాల, రహదారుల పక్కన చెత్తాచెదారం దర్శనమిస్తోంది. వీటికి స్థానిక ప్రజలు నిప్పు పెడుతుండడంతో పొగ వల్ల వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో వారు పనులకు రాలేని పరిస్థితి ఉందని స్థానిక ప్రజలు చెబుతున్నారు. అలాగే రెండు నెలలుగా మంచినీటి పథకం మోటారు మరమ్మతులకు గురికావడంతో కొళాయిల నుంచి చుక్క నీరు రావడం లేదు. దీంతో గ్రామస్థులు తాగునీటికి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత్యంతరం లేక మహిళలు స్థానికుల ఇళ్ల ఉన్న బోర్లు ద్వారా నీటిని సేకరించుకుంటున్నారు. ఏదేమైనా ఐదు నెలలుగా జి.కోడూరు గ్రామంలో పాలన కుంటిపడిపోవడంతో గ్రామస్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి గ్రామంలో తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, పాలనపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.



జి.కోడూరు సచివాలయం పక్కనే పేరుకుపోయిన చెత్త కుప్పలు



చుక్క నీరు ఇవ్వని రక్షిత నీటి పథకం



గ్రామంలోని వేరొకరి ఇళ్లకు వెళ్లి మోటార్ల ద్వారా నీరు పట్టుకుంటున్న మహిళలు

యువతకు ఉజ్వల భవితను ఇవ్వడమే ధ్యేయం

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దేవరాపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉజ్వల భవితను ఇవ్వడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జాబ్‌మేళాలు నిర్వహిస్తూ జాతీయ, అంతర్జాతీయంగా పేరొందిన సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు. వీటితో పాటు ఉపాధ్యాయ, కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేపట్టామన్నారు. నిరుద్యోగ యువతలో నైపుణ్యాన్ని వెలికితీసి, వారు కోరుకున్న రంగాల్లో స్థిరపడేలా నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాలను పెడుతున్నామన్నారు. ఇన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం యువతకు అవకాశాలు కల్పిస్తున్నదని ఆయన చెప్పారు.

కాగా, ఈ జాబ్‌మేళాలో 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై 257 మంది నిరుద్యోగులను ఇంటర్వ్యూలు చేశారు. వారిలో 122 మందికి నియామకపత్రాలు అందించారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగరహిత దేశంగా మార్చడానికి తమవంతు కృషి చేస్తామంటూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గోవిందరావు, సీఐ పైడపునాయుడు, ఎంపీడీవో సువర్ణరాజు, కళాశాల ప్రిన్సిపాల్ రాధ, ఎంఈవో ఉమ, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, పార్టీ నేత పాత్రునాయుడు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు 13డివిపి1

అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

మండలంలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి నాలుగు మండలాల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గాన్ని జిల్లాలోనే గుర్తింపు పొందేలా తీర్చిదిద్దుదామని, ఇందుకు అందరూ సహకరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గాన్ని అల్లూరి జిల్లాలో కలుపుతామన్న ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు.

వైసీపీ రాజకీయ వేధింపులతో అభివృద్ధికి విఘాతం

నియోజకవర్గానికి రూ.2 కోట్ల ఉపాధి పెండింగ్ నిధుల విడుదల

కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే రాజు

చోడవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాజకీయ వేధింపులతో అభివృద్ధికి విఘాతం కలుగుతున్నదని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. 2014-19 తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు చేసి బిల్లులు మంజూరు కాకుండా ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు, ప్రజా ప్రతినిధులకు కూటమి ప్రభుత్వం పెండింగ్ బిల్లులను విడుదల చేసింది. ఈ సందర్భంగా మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధులు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు చేయుండా తీవ్రంగా వేధింపులకు గురిచేసిందన్నారు. దీనివల్లే వైసీపీ హయాంలో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకురాలేదన్నారు. అభివృద్ధిని రాజకీయ కోణంలో చూస్తే అంతిమంగా ప్రజలు నష్టపోతారన్నారు. కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను పనులు చేసిన వారి ఖాతాలో వేయాలని, పెండింగ్ పనులు పూర్తయ్యేలా తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఉపాధి పథకం ఏపీడీ మణికుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 341 పనులకు సంబంధించి రూ.కోటి 99 లక్షల 13 వేల రూపాయలు విడుదలయ్యాయన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజును ప్రజా ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ సత్యనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్స్యరాజు. నాలుగు మండలాల ఎంపీడీవోలు, టీడీపీ నాయకులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

భారీ వర్షం.. రహదారులు జలమయం





వర్షం నీటితో పొంగి ప్రవహిస్తున్న కృష్ణాదేవిపేట బొడ్డేరు గెడ్డ.. గొలుగొండలో కురుస్తున్న వర్షం

గొలుగొండ/కృష్ణాదేవిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భారీ వర్షం పడింది. మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసింది. పాతమల్లంపేట, ఏటిగైరంపేట, గొలుగొండ, జోగంపేట, అమ్మపేట, గుండుపాల. పాకలపాడు, చీడిగుమ్మల, కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, చోద్యం, లింగంపేట, విప్పలపాలెం, నాగాపురం తదితర గ్రామాల్లో వర్షం పడింది. దీంతో రహదారులపై వర్షం నీరు ఏరులై పారింది. పలు రోడ్లు జలమయమయ్యాయి. కృష్ణాదేవిపేటలోని బొడ్డేరు గెడ్డ వర్షం నీటితో పొంగి ప్రవహిస్తోంది. కొంగసింగి రహదారిలోని గోతుల్లో వర్షం నీరు నిల్వ ఉండిపోయింది. ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో నీరు ఎటుపోలేని దుస్థితి నెలకొంది. కాగా, ఈ వర్షంతో ఖరీఫ్ వరి సాగుకు నీటి కొరత ఉండదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మాడుగులలో కాంగ్రెస్ నిరసన

మాడుగుల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. మాడుగుల బస్టాండ్ ఆవరణం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల కొండలరావు మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా తప్పులను ఎత్తిచూపి ప్రశ్నిస్తున్న రాహుల్‌పై కేసులు బనాయిస్తారా? ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతుల అణచివేత వైఖరిని ప్రజాస్వామ్య వాదులు, రాజకీయ నాయకులు వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.రాంబాబు, లక్కుర్తి అప్పారావు, సల్మాన్‌రాజు, గండి శంకర్రావు, యేసురాజు, పిల్లా అప్పారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆలయ ఈవో కేఎల్ సుధారాణి తెలిపారు. దరఖాస్తుదారులు 30 ఏళ్లు పైబడి హిందూ మతస్థులై ఉండాలని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం దేవస్థానం వారిని సంప్రతించాలని కోరారు.

గ్రంథాలయం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న కార్యదర్శి కుమార్‌రాజు

నాతవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నాతవరం గ్రంథాలయం అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు తెలిపారు. స్థానిక గ్రంథాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. భవనం శిథిలావస్థకు చేరుకుని వర్షాలకు కారిపోతుండడం చూసి ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల విలువైన పుస్తకాలు భద్రపరచడం ఇబ్బందిగా ఉందని స్థానిక అధికారి కుమార్‌రాజు దృష్టికి తీసుకువచ్చారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

ఎంఈవో-2ను కలిసిన పీఆర్టీయూ నాయకులు



కృష్ణప్రసాద్‌ను కలిసిన పీఆర్టీయూ నాయకులు

గొలుగొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో విద్యా శాఖ కార్యాలయంలో ఎంఈవో-2 కృష్ణప్రసాద్‌ను బుధవారం పీఆర్టీయూ నాయకులు కలిశారు. సంఘం మండల అధ్యక్షుడు జి.శ్రీరామ్మూర్తి, సభ్యులు నాగు, బాలకృష్ణ, శివకేశ్వరరావు, కనకరాజు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం మండలంలోని పాఠశాలల పరిస్థితులను వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా విజయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు అందుకు స్వామివారు

మాడుగుల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీ పార్కు వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో విజయాంజనేయస్వామి విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి పూజా కార్యక్రమాలతో పాటు హోమం నిర్వహించారు. అలాగే సీతారాముల కల్యాణం జరిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు స్థానిక, స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

పాఠశాలకు విరాళం ఇవ్వడం ఆనందకరం: ఎంఈవో

చీడికాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తాను చదువుకున్న పాఠశాలకు విరాళం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని ఎంఈవో బీవీ.రమణ అన్నారు. తురువోలు ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయంతో కమ్యూనిటీ భవన నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా అదే పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన ఎంఈవో రమణ కూడా బుధవారం పాఠశాల హెచ్ఎం రామకృష్ణ, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు జీవీఏ.నాయుడుకు తనవంతు కొంత నగదును విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

గొలుగొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు టి.శ్రీదేవి తెలిపారు. మండలంలోని కసిమి గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తు తరాల ఆరోగ్యం బాగుండాలంటే ప్రకృతి వ్యవసాయం సాగుతో సాధ్యమన్నారు. ఈ దిశగా రైతులు ముందుకు సాగాలని సూచించారు. సాగులో లేని భూములకు పంటల నమోదు చేయించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సుధారాణి, ఆత్మ బీటీఎం కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

నాతవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీ ప్రసాద్ చెప్పారు. మండల కేంద్రంలో చిరుధాన్యాల పరిశోధన సంస్థ ప్రోత్సాహంతో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మట్టి పరీక్షలు చేసుకున్నాక పంటకు తగిన ఎరువులు వాడాలని చెప్పారు. ఏయే పంటకు ఏ ఎరువులు వాడాలనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో ప్రేమసాయి నవకిషాన్ సీఈవో ఎ.చంద్రిక, వ్యవసాయాధికారి సుగుణ, ఎఫ్ఈవో చైర్మన్ ఎస్.రామునాయుడు, గ్రామీణ బ్యాంకు మేనేజర్ గౌరి, నాయకులు ఎన్.విజయ్‌కుమార్, పి.కొండబాబు, ఎ.రాంబాబు, పైల సూరిబాబు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

బుచ్చెయ్యపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బీ.పురం, బంగారుమెట్ట గ్రామాల్లో మహిళలకు కుట్టు మిషన్లు, విద్యార్థులకు గ్లాసులు, కంచాలను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు బుధవారం పంపిణీ చేశారు. అనంతరం తాగునీటి బోర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో అమెరికా దేశీయులు సేవా కార్యక్రమాలు చేయడం ప్రశంసనీయమన్నారు. వారిని ఈ ప్రాంతానికి పరిచయం చేసిన మహంతిని అభినందించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదల సత్యనారాయణ, సర్పంచులు మెల్లి శ్రీను, బాబూరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దొండా శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు వై.జగ్గారావు, మాజీ సర్పంచ్ టి.దాసు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ

నర్సీపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బలిఘట్టం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అల్లాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ గవిరెడ్డి రమణ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమన్నారు. పాఠశాలలో విద్యార్థుల కోసం కంప్యూటర్ ఇస్తానని ట్రస్టు ప్రతినిధి అల్లాడ సురేశ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.శ్రీదేవి, ఉపాధ్యాయుడు ఐ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనంతసాగరంలో వైద్య శిబిరం

గొలుగొండ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగరం గ్రామంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్యామ్‌కుమార్ 45 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారికి అవసరమైన మందులు అందించారు. ప్రస్తుతం వర్షాల సీజన్ కావడంతో కాచి ఒడబోసిన నీటిని తాగాలని, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ఈ సందర్భంగా డాక్టర్ శ్యామ్‌కుమార్ సూచించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కృష్ణాదేవిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని ఎస్ఐ వై.తారకేశ్వరరావు కోరారు. ఏఎల్ పురం హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 జి.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

బుచ్చెయ్యపేట, ఆగస్టు 13 (ఆంధ్ర జ్యోతి): మండల కేంద్రంలోని పాఠశాలలో మత్తు పదార్థాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలను ఎస్ఐ ఎన్.శ్రీనివాస్ వివరించారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా 100 నంబర్‌ను సంప్రదించి సహాయం పొందవచ్చని ఆయన చెప్పారు.

ఎమ్మార్పీకి మించి ఎరువులు విక్రయిస్తే కేసులు

రావికమతం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రసాయనక ఎరువులు, క్రిమిసంహారక మందులను నిర్దేశిత ధరకు మించి విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని వ్యవసాయాధికారి రమేశ్‌బాబు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం తనిఖీలు చేశారు. ఎరువులు కొన్న ప్రతీ వ్యక్తికి బిల్లు ఇవ్వాలని, దుకాణం ముందు మందుల పట్టిక ఉంచాలని ఈ సందర్భంగా యజమానులకు ఏవో ఆదేశించారు. ఎరువుల నిల్వలు రికార్డులకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు.

కొత్తపెంటలో స్వచ్ఛతపై సర్వే

దేవరాపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపెంట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలో సదుపాయాలపై రాష్ట్ర స్వచ్ఛత సేవా సంస్థ ప్రతినిధి జి.సుధీర్ బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ సంస్థల్లో మరుగుదొడ్లు, పరిసర పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ వెంకటరావు, కోఆర్డినేటర్ త్రినాథ్, డిప్యూటీ ఎంపీడీవో ఉమాదేవీ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వో విధుల నుంచి కార్యదర్శులను మినహాయించాలి

కె.కోటపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శులను బూత్ లెవల్ ఆఫీసర్ విధుల నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సాంబశివరావుకు కలిసి వినతిపత్రం అందించారు. అనేక పనుల ఒత్తిడితో సతమమతవుతున్నామని, గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, ఇంటి పన్నుల వసూలు, తడి, పొడి చెత్త సేకరణ తదితర పనులతో తీవ్ర ఒత్తిడి ఉందని పేర్కొన్నారు. పని భారం ఎక్కువ ఉన్నందున బీఎల్‌వో విధుల నుంచి మినహాయించాలని కోరారు. సంఘ ప్రతినిధులు సురేశ్‌బాబు, శ్రీనివాస్, 16 పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్పన్న భక్తులకు వరం నిత్యాన్న ప్రసాదం



దేవస్థానం ఉద్యోగుల కృషితో ఆరంభం

- దాతల సహకారంతో 36 ఏళ్లుగా సాగుతున్న వైనం
- ప్రతిరోజూ సుమారు 3 వేల మందికి భోజనం
- రూ.36.45 కోట్లకు చేరిన అన్నదాన విరాళాలు

సింహాచలం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లోకీ అన్నదానం మేలు అన్న ఆర్యోక్తిని సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉద్యోగులు 36 ఏళ్ల కిందట నిజం చేశారు. రూ.50 వేలను విరాళంగా సమర్పించి పెద్దమనసుతో నిత్యాన్న ప్రసాద పథకానికి అంకురార్పణ చేశారు. ఈ క్రమంలో 1989 ఆగస్టు 24న అప్పటి దేవస్థానం ఈవో నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రారంభమైన పథకం నేటికీ అప్రతిహతంగా సాగుతూ భక్తుల మన్ననలు అందుకుంటోంది.

అప్పన్న దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల ఆకలి తీర్చాలనే సదుద్దేశంతో దేవస్థానం ఉద్యోగులు మంచి మనసుతో ప్రారంభించిన అన్నప్రసాద పథకానికి అనేకమంది దాతలు నిరంతం సహాయ సహకారాలు అందిస్తున్నారు. దాంతో 2014లోని హుద్‌హుద్, 2021లోని కరోనా వంటి ప్రకృతి విపత్తుల వేళ దేవస్థానం అధికారులు నిత్యాన్న ప్రసాద పథకం కింద ఉడతా భక్తిగా వేలాది మందికి పులిహోర, కదంబం, దద్దోజనం, పులిహోర వంటి ప్రసాదాలను ప్యాకెట్లుగా చేసి బాధితులకు అందజేశారు.



రోజుకు 3 వేలమందికి

పథకం ప్రారంభించిన మొదట్లో ప్రతిరోజూ 200 మందికి మాత్రమే అన్నప్రసాదాన్ని అందించగా, ప్రస్తుతం ప్రతిరోజు కనీసం మూడువేల మంది భక్తులకు, ప్రభుత్వ ఆదేశాల మేరకు గరిష్ఠంగా ఐదు వేల మందికి అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం, రాత్రి సమయంలో ప్రతిరోజు రెండువందల మందికి అన్నప్రసాదాన్ని రుచికరంగా వండి వడ్డిస్తున్నారు. ఈ పథకానికి రూ.లక్షకు పైగా విరాళం సమర్పించిన దాతలను మహారాజ పోషకులని, రూ.50వేలు, అంతకంటే ఎక్కువ విరాళం ఇచ్చిన వారిని రాజపోషకులని, రూ.10వేలు అంతకంటే ఎక్కువ విరాళాలు సమర్పించిన వారిని పోషకులని వ్యవహరిస్తారు. దాతలకు నగదు రశీదుతోపాటు డోనార్ కార్డును అందజేస్తారు. డోనార్ కార్డుతో దాత కుటుంబసభ్యులకు ఏడాదిలో ఒకరోజు స్వామివారిని ఉచితంగా దర్శనం చేసుకునేందుకు వీలు కల్పిస్తారు. విరాళం అందజేసిన రోజున స్వామి దర్శనంతోపాటు శేష వస్త్రం, వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేస్తారు. భక్తులు కోరిన రోజున ఏడాదికి ఒకసారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేస్తారు. వారు అందించిన విరాళంపై వచ్చే వడ్డీతో భక్తులకు అన్నప్రసాదం అందిస్తారు. ప్రతిరోజు అన్నప్రసాద భవనం ముందు బోర్డుపై ఆరోజు దాతల పేర్లను రాస్తారు.

విరాళాలివ్వాలంటే...

భక్తులు విరాళాలు సమర్పించేందుకు అప్పన్న స్వామి ఆలయం పరిసరాల్లో మూడు స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం బయటకు వచ్చు దక్షిణ రాజగోపురం వద్ద, పీఆర్వో కార్యాలయం, అన్నప్రసాద భవనం వద్ద విరాళాలను స్వీకరిస్తారు. విరాళాల పూర్తి సమాచారం కోసం భక్తులు 9398734612 నంబరులో సంప్రదించాలని అధికారులు ప్రకటించారు.

వడ్డీ సొమ్ముతోనే ప్రసాదం

భక్తితో దాతలు సమర్పించిన విరాళాలను జాతీయ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, దానిపై లభించే వడ్డీతో అన్నప్రసాద పథకం కింద రుచికరమైన భోజనాన్ని వడ్డిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం నాటికి బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ చేసిన సొమ్ము సుమారు రూ.36.45 కోట్లకు చేరింది. డిపాజిట్లపై సుమారు రూ.2కోట్ల వరకు వడ్డీ లభిస్తున్నది. విరాళలపై వచ్చే వడ్డీతో తాజా గణాంకాల ప్రకారం ఏడాదిలో సుమారు 12 లక్షల మందికి అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

... 5వ పేజీ తరువాయి

ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. సీఐ అల్లు స్వామినాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు.



త్వరితగతిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం

- ఆర్‌సీ ప్లాట్ల అభివృద్ధి పనులు వేగవంతం
- అధికారులకు వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశం

సబ్బవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లలపాలెం- అమృతపురం మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. గొల్లలపాలెం- అమృతపురం మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు, పెదముషిడివాడ- దువ్వాడ రోడ్డు విస్తరణ (గంగవరం మీదుగా)పనులు, గాలిభీమవరం రైతులకు ఇచ్చిన ఆర్‌సీ ప్లాట్ల అభివృద్ధి పనులు, నల్లరేగులపాలెంలో కొత్తగా ల్యాండ్ పూలింగ్‌లో సమీకరించనున్న భూములను ఆయన పరిశీలించారు. వీఎంఆర్‌డీఏ చేపట్టిన పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సకాలంలో రైతులకు ఆర్‌సీ ప్లాట్లు అప్పగించాలన్నారు. స్థానికులతో పాటు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందలి వెంకటరమణ మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన ఆర్‌సీ ప్లాట్లకు సంబంధించిన అంతర్గత రోడ్లు ప్రధాన మార్గానికి అనుసంధానం చేయాలని కోరారు. ఎక్కడికక్కడ కల్వర్టులు నిర్మించి, భవిష్యత్తులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పుడే చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కమిషనర్ వెంట ఎస్‌ఈ భవానీశంకర్, ఎస్టేట్ ఆఫీసర్ దయానిధి, వీఎంఆర్‌డీఏ సర్వేయర్ స్నేహ, డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్ అప్పారావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, సచివాలయ సర్వేయర్ లోకేశ్, పలువురు రైతులు పాల్గొన్నారు.



గొల్లలపాలెంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథన్

పైడమ్మ చెరువు చుట్టూ ఎన్ఏవోబీ ఫెన్సింగ్

- అడ్డుకున్న వాడనర్సాపురం గ్రామస్థులు

రాంబిల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడనర్సాపురం గ్రామాన్ని ఆనుకొని ఉన్న పైడమ్మ చెరువు చుట్టూ ఎన్ఏవోబీ(నేవల్ ఆల్టర్నేట్ ఆపరేటింగ్ బేస్) ప్రాజెక్టు అధికారులు ఫెన్సింగ్ వేయడానికి పనులు ప్రారంభించగా గ్రామస్థులు బుధవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కారే రామరావు, మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి దేముడు తదితరులు మాట్లాడుతూ మత్స్యకార కుటుంబాలు పూర్వం నుంచి చెరువులో చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారన్నారు. గ్రామంలో కనీసం ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా రెవెన్యూ అధికారులు ఈ చెరువును డిఫెన్స్ వారికి అప్పగించడం అన్యాయమన్నారు. గతంలో కూడా పలుమార్లు ఈ చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేయడానికి అధికారులు ప్రయత్నించారని, అప్పటి కలెక్టర్ ఈ గ్రామాన్ని తొలగించేంత వరకు ఈ చెరువు గ్రామ ఆధీనంలోనే ఉంటుందని చెప్పి మినిట్స్‌లో కూడా రాశారన్నారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని నేవీ అధికారులు, కాంట్రాక్టర్‌కు గ్రామస్థులు తెల్చి చెప్పడంతో చేసేది లేక వారు వెనుదిరిగారు.



ఎన్ఏవోబీ ప్రాజెక్టు అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న గ్రామస్థులు

స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం జరగబోయే స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను అడిషినల్ ఎస్పీ (పరిపాలన) ఎం.దేవప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిందిస్థాయి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎం.శ్రావణి, ఏఆర్ డీఎస్పీ, సీఐలు పాల్గొన్నారు.



వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ దేవప్రసాద్

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో సత్తాచాటిన డిగ్రీ కళాశాల విద్యార్థులు



రాష్ట్ర సమాచార కమిషనర్ శామ్యూల్ జనార్దన్ నుంచి బహుమతులు అందుకుంటున్న క్విజ్ విజేతలు

చోడవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అంతర్ కళాశాలల క్విజ్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి సత్తాచాటారు. సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉన్నత విద్యా శాఖ ఆదేశాల మేరకు సోమవారం విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో రాష్ట్రస్థాయి అంతర్ డిగ్రీ కళాశాలల క్విజ్ పోటీలు నిర్వహించారు. చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వై.ధనలక్ష్మి, గాయత్రి, కృపాచందు బృందం ఈ పోటీల్లో సత్తా చాటి ప్రథమ బహుమతి సాధించింది. విజేతలుగా నిలిచిన విద్యార్థులను రాష్ట్ర సమాచార కమిషనర్ శామ్యూల్ జనార్దన్ అభినందించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, సమన్వయకర్త నారాయణమూర్తి పాల్గొన్నారు.

వైసీపీకి ఝలక్!

... 5వ పేజీ తరువాయి

నుంచి పెదగుమ్ములూరు ఎంపీటీసీ సభ్యురాలు నకరబోయిన వెంకటలక్ష్మి నామినేషన్లు వేశారు. టీడీపీ సభ్యురాలి పేరును ప్రతిపాదించేవారు, బలపరిచేవారు లేకపోవడంతో నామినేషన్‌ను తిరస్కరించినట్టు ఎన్నికల అధికారిణి మనోరమ తెలిపారు. అనంతరం చేతులు ఎత్తే విధానంలో ఎన్నికలు నిర్వహించగా వైసీపీకి చెందిన సత్య సూర్యవిజయకుమారికి అనుకూలంగా ఎనిమిది మంది, ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన వెంకటలక్ష్మికి అనుకూలంగా పదకొండు మంది చేతులెత్తారు. దీంతో వెంకటలక్ష్మి ఎంపీపీగా ఎన్నికైనట్టు మనోరమ ప్రకటించారు. టీడీపీకు చెందిన ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు వెంకటలక్ష్మికి మద్దతు ఇచ్చారు. వైసీపీకి ఇటీవల రాజీనామా చేసి ఇప్పటి వరకు తాత్కాలిక ఎంపీపీగా కొనసాగిన బొలిశెట్టి గోవిందరావు.. వైసీపీకి ఎంపీపీ పదవి దక్కకుండా తన వర్గానికి చెందిన సభ్యురాలిని ఇండిపెండెంట్‌గా పోటీ చేయించి టీడీపీ మద్దతుతో గెలిపించుకున్నారు.

రిజిస్టర్ పోస్టు సేవలు కనుమరుగు

... 5వ పేజీ తరువాయి

ప్రజలు ప్రైవేటువైపు మొగ్గుచూపుతున్నారు. దీనికితోడు డిజిటల్ పేపర్ లెస్ సేవలు (ఈ మెయిల్స్), సామాజిక మాధ్యమాలు, ఈ-కామర్స్ లాజిస్టిక్ సేవలు విస్తృతం కావడంతో తపాలా శాఖ రిజిస్టర్ పోస్టు సేవలకు ఆదరణ బాగా తగ్గిపోయింది. దీంతో రిజిస్టర్ పోస్టు సేవలను వచ్చే నెల ఒకటో తేదీ నుంచి నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. దీనిని స్పీడ్ పోస్టులో విలీనం చేయడం ద్వారా పోస్ట్ ట్రాకింగ్, డెలివరీలో వేగం, కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచాలని పోస్టల్ శాఖ భావించింది. కాగా స్పీడ్ పోస్టు సేవల ఖర్చు కొంచెం ఎక్కువ అయినప్పటికీ ప్రస్తుత డిజిటల్ యుగంలో ఈ మార్పు అవసరమని పోస్టల్ అధికారులు అంటున్నారు. ప్రజలు వేగంగా తమకు సేవలు అందాలని కోరుకుంటున్నారని, ఈ విషయంలో ఖర్చుకు వెనుకాడడంలేదని అభిప్రాయపడుతున్నారు.

క్రైం... crime news

17 కిలోల గంజాయి స్వాధీనం

కొత్తూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం భట్లపూడి గ్రామ సమీప జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి 17 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్టు చేశామని అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. దీనికి సంబంధించి వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. అనకాపల్లి రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్‌కు వచ్చిన సమాచారం మేరకు భట్లపూడి సమీపంలో హైవేపై మంగళవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో అటుగా వస్తున్న కారును పోలీసులు ఆపి, దానిలో వున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరుకు చెందిన మోహన్, ఎం.మిథున్, అరవింద్‌కుమార్, మనోజ్ చంద్రశేఖర్‌తోపాటు మరొకరు సోమవారం బెంగళూరు నుంచి అరకు చేరుకొని డుంబ్రిగుడ మండలం పొద్దగూడ గ్రామానికి చెందిన కొర్ర గోపి వద్ద 17 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. తిరిగి బెంగళూరు వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఒక వ్యక్తి పరారయ్యాడు. గంజాయితోపాటు కారు, ఐదు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు.

బాలికపై హత్యాయత్నం.. యువకుడి అరెస్టు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి, పెళ్లికి నిరాకరించిన బాలికపై హత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని బుధవారం అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. కొత్తూరుకు చెందిన 17 ఏళ్ల బాలిక ఇంటర్ పూర్తిచేసింది. ఇదే ప్రాంతానికి చెందిన బి.మహాలక్ష్మి నాయుడు అనే యువకుడు ప్రేమించి పెళ్లి చేసుకోవాలని భావించాడు. అయితే బాలిక తల్లిదండ్రులు మందలించడంతో ప్రేమ, పెళ్లికి ఆమె నిరాకరించింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఇంటి బయట ఉన్న బాలిక వద్దకు మహాలక్ష్మినాయుడు వచ్చాడు. ఇద్దరం కలిసి ఎక్కడికైనా వెళ్లిపోయి పెళ్లి చేసుకుందామని చెప్పాడు. ఇందుకు బాలిక నిరాకరించడంతో వెంట తెచ్చుకున్న చాకుతో బాలిక గొంతుపై కోసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గాయపడిన బాలికను కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అనంతరం బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు మహాలక్ష్మినాయుడుని బుధవారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కేసును పట్టణ ఎస్ఐ డి.ఈశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన విద్యార్థిని ఆచూకీ లభ్యం

నర్సీపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యం కేసును పట్టణ పోలీసులు ఛేదించారు. రోలుగుంట మండలం ఎం.కె.పట్నం గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక విశాఖపట్నంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నది. ఈ నెల 10వ తేదీన కళాశాలకు వెళ్లడానికి బంధువు ఒకరు ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విడిచి పెట్టారు. అనంతరం విశాఖపట్నం వెళ్లే బస్సు ఎక్కిన విద్యార్థిని, కళాశాలకు చేరుకోలేదు. ఈ విషయం తెలుసుకున్న బాలిక తల్లి నర్సీపట్నం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేసి బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆమె చదువుతున్న కళాశాల, వుంటున్న హాస్టల్‌లో విచారించారు. నర్సీపట్నం, విశాఖపట్నంలోని వివిధ ప్రాంతాల్లో వున్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించి విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్నట్టు గుర్తించి పట్టుకున్నారు. అనంతరం బాలికను తల్లికి అప్పగించారు. ఈ కేసును రూరల్ సీఐ రేవతమ్మ, పట్టణ ఎస్ఐ ఉమామహేశ్వరరావు దర్యాప్తు చేశారు.

77 టేకు దుంగలు స్వాధీనం

నర్సీపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కోటవురట్ల మండలం ఎండపల్లిలోని ఒక ఖాళీ స్థలంలో టేకు దుంగలు నిల్వచేసినట్టు అటవీ శాఖ స్క్వాడ్ సిబ్బందికి సమాచారం అందింది. దీంతో బుధవారం సాయంత్రం స్క్వాడ్ రేంజర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. అక్కడ వున్న 77 టేకు దుంగలను స్వాధీనం చేసుకుని అటవీ శాఖ సిబ్బందికి అప్పగించారు.

15 మద్యం బాటిళ్లు పట్టివేత

ఎస్.రాయవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు గ్రామంలో బుధవారం ఓ వ్యక్తి నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ విభీషణరావు తెలిపారు. కొరుప్రోలులో ఓ షాపు వద్ద మద్యం అక్రమంగా విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

నక్కపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమలాపురం సమీపంలో పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించి అనుమతుల్లేకుండా మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ట్రైనీ ఎస్ఐ సాహిబా అంజుమ్ తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

రోలుగుంట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో మూడు నెలలుగా తప్పించుకుతిరుగుతున్న నిందితుడిని బుధవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ ఏడాది మే 28న చింతపల్లి నుంచి నర్సీపట్నానికి కారులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో రోలుగుంట పోలీసులు ఛటర్జీపురం వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గంజాయి రవాణా చేస్తున్న కారును ఆపి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. వీరికి గంజాయి విక్రయించిన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం, భౌతి గ్రామానికి చెందిన కిల్లో మచ్చరాజుపై కేసు నమోదు చేసి, గాలింపు చర్యలు చేపట్టారు. అప్పటి నుంచి పరారీలో వున్న అతనిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

విశాఖ జిల్లాలోకి ఎస్.కోట?

- ఎస్.కోట, కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, జామి మండలాలు విలీనం ప్రతిపాదన

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనపై మళ్లీ చర్చ జరుగుతోంది. విశాఖ జిల్లా స్వరూపం మారే సూచనలు కనిపిస్తున్నాయి. పార్లమెంటు నియోజకవర్గమంతా ఒక జిల్లా పరిధిలో ఉండాలనేది ఒక ప్రతిపాదన. ఆ విధంగా ఉన్నట్టయితే అన్నింటికీ వెసులుబాటుగా ఉంటుందని, ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల పునర్విభజన జరిగితే కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. విశాఖ పార్లమెంటు పరిధిలో గల శృంగవరపుకోట అసెంబ్లీ నియోజకవర్గం ప్రస్తుతం విజయనగరం జిల్లాలో ఉంది. దానిని ఇప్పుడు విశాఖ జిల్లా పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపాదిస్తున్నారు. అలా చేసినట్టయితే ఆ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎస్.కోట, లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ, జామి మండలాలు విశాఖ జిల్లాలోకి వస్తాయి.

పెందుర్తిని మార్చాల్సి ఉంది

పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉంది. అయితే ఆ నియోజకవర్గంలోని పరవాడ, సబ్బవరం మండలాలు అనకాపల్లి జిల్లాలో ఉండగా, పెందుర్తి మండలం మాత్రం విశాఖ జిల్లాలో ఉంది.

డివిజన్లు కూడా మార్చాలి

కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినప్పుడు రెవెన్యూ డివిజన్ల విభజన సక్రమంగా జరగలేదు. విశాఖ నగరం నడిబొడ్డునున్న అక్కయ్యపాలెం, సీతమ్మధార, మద్దిలపాలెం ప్రాంతాలు భీమిలి రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. ఆ డివిజన్‌లో చినగదిలి, సీతమ్మధార మండలాలను చేర్చారు. వాస్తవానికి అవి విశాఖ రెవెన్యూ డివిజన్‌లో ఉండాలి. ఇప్పుడైనా వీటిని మార్చాల్సి ఉంది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519